J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 49 12.05.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# ఆపదలో అక్షరం

## ప్రమాదంలో పాత్రికేయం

- కలంపై కత్తి పెడుతున్న ప్రభుత్వాలు
- వార్త రాస్తే వాతలు పెడతామంటున్న నేతలు
- అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాలలో ఒకే పోకడ
- బరితెగిస్తున్న సామాజిక మాధ్యమాలు
- డోలాయమానంలో మీడియా సంస్థలు
- ప్రశ్నార్థకంగా మారిన చిన్న పత్రికల మనుగడ



వార్తా పత్రికలంటే ప్రజలకి ప్రభుత్వాలకి మధ్య వారధులుగా పనిచేసే కరదీపికలు. వార్తా సంస్థలంటే సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే సాధనాలు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియాకి గౌరవ స్థానం ఉంది. సమాజాన్ని నడిపించే నాలుగు ప్రధాన విభాగాలలో ఒకటిగా జర్నలిజానికి గుర్తింపు ఉంది. అలాంటి పాత్రికేయం... ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఏ వార్త రాస్తే ఏం జరుగుతుందో, ఏ తప్పును ఎత్తిచూపితే తమకు ఏం ముప్పు కలుగుతుందో, ఏ క్షణాన ఏ కేసు తమపై బనాయింపబడుతుందో, ఎప్పుడు... ఎక్కడ తమపై ఎవరు దాడిచేస్తారో? అన్న భయంతో బ్రతికే పరిస్థితులలో మీడియా సంస్థలు బిక్కుబిక్కుమంటూ తమ మనుగడ కొనసాగిస్తున్నాయి.


### చరిత్రను ఒకసారి గమనిస్తే....

సమాచార వ్యవస్థ తొలిసారిగా 1566లో అంటే 457 సంవత్సరాల క్రితం 15వ శతాబ్దంలో ఇటలీ దేశంలోని వినీస్ నగరంలో ప్రారంభమయ్యింది. అప్పట్లో తెల్ల కాగితంపై చేతి వ్రాతతో రాసి వారానికి ఒకసారి యుద్ధాలు, రాజకీయాల గురించిన సమాచారాన్ని ప్రజలకి చేరవేసేవారని మనకి చరిత్ర చెప్తుంది. చేతి వ్రాతతో కాకుండా కాగితంపై ముద్రించిన తొలి వారపత్రిక 1609లో జర్మనీలో పురుడుపోసుకుంది. చేతివ్రాత నుండి ముద్రణకి మారడానికి 43 సంవత్సరాలు పట్టింది.




1780 లో ఆసియా ఖండంలో ప్రచురితమైన మొట్టమొదటి పత్రిక

పత్రిక ముద్రణకి నోచుకున్నా, అప్పట్లో పత్రికా స్వేచ్ఛ ఉండేది కాదు. పత్రికలపై ప్రభుత్వ అజమాయిషీ ఉండేది. ఇప్పుడు సినిమాలని చేసినట్లుగా అప్పట్లో పత్రికలని కూడా సెన్సార్ చేసేవాళ్ళు. 1695లో అప్పటి ఆంగ్ల ప్రభుత్వం సెన్సార్ పద్ధతిని ఎత్తేసి పత్రికా స్వేచ్ఛని ప్రకటించింది. అక్కడినుండి ఈ వార పత్రికల ఉనికి ఎక్కువైంది. పత్రికలు చదివే వారి శాతం క్రమేణా పెరిగింది. అమెరికాలోని బోస్టన్, ఫిలాడల్ఫియాలతో పాటు మరికొన్ని దేశాలలోని ప్రధాన నగరాలలో ప్రజలు పత్రికలకి బాగా అలవాటుపడ్డారు. ముద్రణా విధానాన్ని వేగపరచి వేల కాపీలు ఒకేసారి అచ్చు వేయగలిగే సాంకేతిక పరిజ్ఞానం రావడానిక 135 సంవత్సరాలు పట్టింది. 1830 సంవత్సరంలో తొలి దినపత్రిక అచ్చయింది. అక్కడి నుండి వార్తా పత్రికల పరంపర నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది.




### 1780లో తొలి భారతీయ పత్రిక...

విలియం బోల్ట్స్ అనే డచ్ సాహసికుడు 1766లో భారతదేశంలోని కలకత్తాలో పత్రికలను పరిచయం చేసే ప్రయత్నం చేశాడు. అయితే అప్పట్లో ఈస్ట్ ఇండియన్ కంపెనీ విలియం బోల్ట్స్‌ని దేశం నుండి బహిష్కరించడంతో ఆయన కల కలగానే మిగిలిపోయింది.

ఆ తరువాత 1780లో జేమ్స్ అగస్టస్ హిక్కి అనే ఆయన "హిక్కిస్ బెంగాల్ గెజిట్" అనే ఆంగ్ల పత్రికను ప్రచురించాడు. భారతదేశంలో ముద్రించబడిన తొలి వార్తాపత్రిక అదే. ఈస్ట్ ఇండియా కంపెనీ గవర్నర్‌తో సహా, సభ్యుల అవినీతిని అక్రమాలను జేమ్స్ ఎండగట్టాడు. ఆయన రాతలను తీవ్రంగా పరిగణించిన ఈస్ట్ ఇండియా కంపెనీ ఆయన పత్రికని బట్వాడా చేయడానికి లేదంటూ తపాలా శాఖని ఆదేశించింది. అక్కడితో ఆగలేదు జేమ్స్‌పై పరువు నష్టం దావా వేయడంతో పాటు అక్రమ కేసులు బనాయించి ఆయనని ముప్పుతిప్పలు పెట్టింది.




1788 డిసెంబర్ 4వ తేదీ 'ది టైమ్స్ ' పత్రిక మొదటి పేజీ

అదే ఏడాది "ఇండియా గెజిట్" పేరుతో మరో పత్రిక ప్రారంభమై.. ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వాన్ని సమర్ధిస్తూ వార్తలు ప్రచురించడం మొదలుపెట్టింది.

ఆ రోజుల్లోనే గంటకి 1100 కాపీలు ముద్రించే సాంకేతిక యంత్రాలతో "ది టైమ్స్" పత్రిక తన ప్రస్థానాన్ని ప్రారంభించింది.

ఆ తరువాతి కాలంలో భారతదేశంలో కొన్ని వందల మీడియా ఏజెన్సీలు, కొన్ని వేల వార్తా పత్రికలు పురుడు పోసుకున్నాయి. వార పత్రికల పరంపరకి ప్రాధాన్యత తగ్గి

3 లో

## పిడుగుపాటు మృతుని కుటుంబానికి..

# ఆదాల చేయూత

### రూ.50 వేల సాయం అందించిన నెల్లూరు ఎంపీ



నెల్లూరు రూరల్ మండలంలోని కొమ్మర పూడి గ్రామంలో పిడుగు పాటుతో మరణించిన ఒక వ్యక్తి కుటుంబానికి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల తన సొంత నిధుల నుంచి 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడుగుపాటుకు గురైన లక్ష్మయ్య కుటుంబాన్ని చూస్తే చాలా బాధ కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం విషయంలో అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి చేసిన సహాయాన్ని డిసిసిబి మాజీ చైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, కోటేశ్వర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో..

# శ్రీ ఆదిశంకర సంస్మరణోత్సవాలు



నెల్లూరులోని చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో గత నెల 30 నుంచి మే 7వ తేదీ వరకు జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యుల వారి సంస్మరణోత్సవాలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ఆదిశంకర ధ్యానమందిర కమిటీ వారు నిర్వహించిన 'సుందరకాండ' ప్రవచన సప్తాహంలో బ్రహ్మశ్రీ గుడ్డదొన వరప్రసాదరావు వారం రోజుల పాటు వాల్మీకి రామాయణంలోని సుందరకాండ విశిష్టతను హృద్యంగా వివరించారు. ఈ సందర్భంగా చక్రాల ట్రస్ట్ వారు ఈనెల 7న శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించారు. పోతరాజు హేమంతకుమారశర్మ యాజ్ఞికంలో, మల్లవరపు లక్ష్మీనరసింహారావు దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వేడుకగా జరిగింది. ఇందుకూరుపేటకు చెందిన శ్రీ రామాయణం మహేష్‌స్వామి, ఇనమడుగు కృష్ణానందగిరి స్వామి, నెల్లూరు అనంతానందగిరి మాత, విరువూరు మార్కండేయా నందగిరిస్వామి, నెల్లూరు దయానందగిరిస్వామి, నరసింహులుకొండ మహేశానంద స్వామి, నెల్లూరులోని బ్రహ్మశ్రీ మండే లక్ష్మీనరసింహారావు, ఇనమడుగు పురుషోత్తమతీర్థ స్వామి తదితరులు పాల్గొని అనుగ్రహభాషణ గావించారు. శ్రీ చక్రాల వెంకట లక్ష్మీనరసింహం (స్వామి సమయానందనాథ) మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, ట్రస్ట్ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు స్వయంపాకుల శ్రీనివాసులు, మాచవోలు కోటేశ్వరశర్మ, ఉచ్చి భువనేశ్వరీప్రసాద్, సురభి మహలక్ష్మి, గుడ్డదొన వాసుదేవరావు, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, శనగవరపు సత్యనారాయణ, డా.రాజేంద్రప్రసాద్, కెవిఎస్ రాజు, డాక్టర్ పిట్టి భారతి, సుభద్రాదేవి, మన్నేపల్లి గిరిజ, ములుగు బాలాత్రిపురసుందరి, అన్నవరం సత్యనారాయణరావు పాల్గొన్నారు.

# తాళం వేసిన ఇంట్లో చోరీ

- **4 సవర్ల నగలు, రూ. 20 వేలు దొంగలపాలు**

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీచేసే దొంగలు కావలిలో ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. కావలి పట్టణంలోని వేముల నవీన్ అనే వ్యక్తి ఇంటికి తాళాలు వేసి భార్యపిల్లలతో తిరుమలకు వెళ్తే, వచ్చేసరికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న 20వేల రూపాయలతో పాటు, నాలుగు సవర్ల బంగారు వస్తువులు కూడా దొంగిలించుకుపోయారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేశారు. క్లూస్‌టీమ్ రావడం, వేలిముద్రలు సేకరించడం అన్నీ జరిగాయి. కావలి సిఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు రంగంలోకి దిగి దొంగల కోసం గాలిస్తున్నారు.

### బంగారుదండ లాక్కెళ్ళారు

నెల్లూరు ఏసినగర్‌లోని వినాయకుని గుడి సమీపంలో ఉన్న తమ ఇంటి ముందు నిలబడివున్న ఓ వృద్ధురాలి మెడలో ఉన్న 5 సవర్ల బంగారుదండను దుండగులు హఠాత్తుగా తెంపుకునివెళ్ళారు. మోటార్‌బైక్‌పై ఇద్దరు దుండగులు వేగంగా వచ్చి, దండను లాక్కొని పరారైపోయారు. నివ్వెరపోయిన ఆ వృద్ధురాలు ఎలాగో తేరుకుని పెద్దగా అరచినా ప్రయోజనం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జడ్పీ సమావేశం 20న

నెల్లూరు జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం మే 20వ తేది ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని జడ్పీ సిఇఒ బి.చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ మందిరంలో జరిగే ఈ సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షత వహిస్తారని, సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## చేతిరాతపై ఉచితంగా శిక్షణ

నెల్లూరు కర్నాలవీధిలోని సాయినాథ్ స్కూల్‌లో ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు చేతిరాతపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని స్థానిక 'అచిర్వత ఫౌండేషన్' వ్యవస్థాపక అధ్యక్షుడు పీజీడీ కృపాల్ తెలిపారు. ప్రత్యేకించి 'లుసిడ' చేతిరాతకు సంబంధించి ముగ్గురు శిక్షకులతో విద్యార్థులకు శిక్షణ ఇస్తామని, ఉదయం 8నుంచి 10 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగినవారు 98667 22532 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## పుస్తకపఠనంతో విజ్ఞానం

గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని, పుస్తకభాండాగారంలో ఉన్న ఎన్నో అమూల్యమైన పుస్తకాలను చదువుకోవడం ద్వారా విద్యార్థులు ఎంతో విజ్ఞానం పొందవచ్చని నెల్లూరు రంగనాయకులపేటలోని గ్రంథాలయం అధికారిణి వి.అరుణ, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.మాధవరావు చెప్పారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నారు. పుస్తకపఠనం జీవితాలకు మార్గదర్శకమని, విద్యార్థులు శ్రద్ధతో పుస్తకాలు చదివి, వాటిలోని విషయాలను అవగాహన చేసుకుని జీవితంలో రాణించాలని వారు కోరారు.

## రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి కార్యక్రమం ఈనెల 8వ తేది స్థానిక టౌన్‌హాల్ ప్రాంగణంలోని ఏసీ హాల్‌లో జరిగింది. ప్రముఖ న్యాయవాది పీవీ రమణారెడ్డి స్మృత్యంకంగా, ఆయన కుమారుడు పీవీ శ్రీనివాసులురెడ్డి-చేజర్ల వినయ దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఠాగూర్, రమణారెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు సినీ సాహితీవిమర్శకురాలు పి.జ్యోతి పాల్గొని రవీంద్రనాథ్ ఠాగూర్ రచనల విశిష్టతలను తెలియజెప్పారు. అధ్యాపకుడు బత్తిన సాయికుమార్‌రెడ్డి, నెల్లూరు వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అమ్మా యూత్ సేవలు

నెల్లూరులోని అమ్మా యూత్ ఫౌండేషన్ వారు ఈనెల 7 ఆదివారం రోజున నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పేదలకు అన్నం ప్యాకెట్లు పంపిణీచేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సభ్యులు ధనుష్, శశికిరణ్, కార్తికేయ తదితరులు పాల్గొన్నారు.

## గొలగమూడి..శ్రీ వెంకయ్యస్వామి వైద్యశాలలో

# దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

### మే 24న తయారీకేంద్రం ప్రారంభం

**- ఇఓ బాలసుబ్రహ్మణ్యం వెల్లడి**



నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని గొలగమూడి గ్రామంలో వెలసివున్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమంలో ఇటీవల నిర్మించిన వైద్యశాలలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చేందుకు ఆశ్రమ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మహావీర్ జైన్ రిలీఫ్ ఫౌండేషన్ వారి సహకారంతో, తిరుపతిలోని టిటిడి 'బర్డ్ హాస్పిటల్' పూర్వ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ సూచనలతో మే 24వ తేదిన గొలగమూడిలో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారు ఫోన్ నెం. 63054 18947ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అదేవిధంగా, మహనీయులు.. స్వర్గీయ అబ్దుల్‌కలామ్ పేరుమీద ఇండియన్ టెక్నాలజీతో మోచేతి కింది భాగం 'మయో ఎలక్ట్రికల్ హ్యాండ్' (కృత్రిమ అవయవం) తయారు చేశారని, మే 24వతేదిన ఆ తయారీదారుల సాంకేతికబృందం వచ్చి, మోచేయి కిందిభాగం తొలగించబడిన పేషెంట్లను పరిశీలించి తగు సలహాలిస్తారని, అవసరమైనవారికి తక్కువ ధరతోనే కృత్రిమ అవయవాలను అందిస్తారని ఆయన తెలిపారు. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం తరఫున చేస్తున్న సామాజిక మానవీయసేవల్లో భాగంగా, ఈ వైద్యశాలలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి సా.5 గంటల వరకు అల్లోపతి వైద్యం, ఆయుర్వేద వైద్యంతో పాటు ఫిజియో థెరపీ సేవలు కూడా ఉచితంగా అందిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నల్లగొండ్ల లక్ష్మీనృసింహునికి బ్రహ్మోత్సవ శోభ



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన విడవలూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఈనెల 8న అలకలతోపు ఉత్సవం వేడుకగా జరిగింది. తొలుత స్వామివారికి హయ, గజవాహనోత్సవాలను నిర్వహించారు. శ్రీవారిని, అమ్మవారిని వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఆలయ ధర్మకర్త అన్నపురెడ్డి, మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో, నల్లగొండ్ల తూర్పువీధి ప్రజలు ఉభయ కర్తలుగా ఈ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

## ఆత్మకూరులో 'ఐద్వా' నిరసన ర్యాలీ




ఢిల్లీలో రెజ్లింగ్ మహిళా క్రీడాకారిణుల పట్ల అనుచితవ్యాఖ్యలు చేసి మనస్థాపానికి గురిచేసిన రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజేష్‌భూషణ్ తీరును నిరసిస్తూ, వెంటనే ఆయన్ను పదవినుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ మహిళాక్రీడాకారిణులు దేశవ్యాప్తంగా చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా ఈనెల 8న ఆత్మకూరు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఐద్వా నాయకురాళ్ళతో పాటు, సిపిఎం తదితర పార్టీలు, వాటి అనుబంధశాఖల నాయకులు పాల్గొన్నారు.

## వేదగిరిపై వైభవంగా రథోత్సవం



నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 7న అంగరంగ వైభవంగా రథోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని, ఆదిలక్ష్మి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి, ఆనవాయితీ ప్రకారం కొండ కింద ఉన్న దేవరపాళెంలో రథోత్సవం నిర్వహించారు. వేలసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మెన్ సురేంద్రరెడ్డి, ఇఓ గిరికృష్ణల సారథ్యంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు.

# న్యూ మంగళూరు పోర్టుకి 'సాగర్ శ్రేష్టతా సమ్మాన్' అవార్డు

## ఘనత సాధించిన మన నెల్లూరీయుడు




ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పోర్టుల విభాగంలో 2022-23 సంవత్సరానికి గాను 'న్యూ మంగళూరు పోర్ట్ అథారిటీ' అన్ని విభాగాలలో తమ పనితీరులో ప్రతిభను కనపరచి దేశంలో 3వ స్థానంలో నిలచింది. పోర్ట్ పనితీరుకి గాను 'సాగర్ శ్రేష్టతా సమ్మాన్' అవార్డు లభించింది. మే 10వ తేదీ కొత్తఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పోర్టు ఛైర్మెన్ మన నెల్లూరీయుడు డాక్టర్ వెంకటరమణ అక్కరాజు ఈ అవార్డుని అందుకున్నారు. పోర్ట్స్, షిప్పింగ్ & వాటర్‌వేస్ కేంద్రమంత్రి శర్బానంద్ సోనావాల్ చేతులమీదుగా డాక్టర్ వెంకటరమణ ఈ అవార్డుని అందుకున్నారు. ఈ కార్య క్రమంలో కేంద్ర సహాయమంత్రి యశోనాయక్, భారత ప్రభుత్వ పోర్ట్స్, షిప్పింగ్ & వాటర్ వేస్ విభాగ కార్యదర్శి సుదాన్ష్ పంత్ ఐ.ఏ.ఎస్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరీయులు ఎక్కడున్నా తమ ప్రతిభతో నెల్లూరు పేరును విశ్వవ్యాప్తం చేస్తారన్న నానుడిని మరోసారి రుజువు చేసిన డాక్టర్ వెంకటరమణ అక్కరాజుకి 'లాయర్' అభినందనలు.



## సేవకు సత్కారం...

# చంద్రశేఖర్‌రెడ్డికి పురస్కారం!

నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడుగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి రెడ్‌క్రాస్‌కు చేస్తున్న సేవలకు ఉత్తమ పురస్కారం లభించింది. మే 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ అబ్దుల్ నజీర్ 2022-23 సంవత్సరానికి సంబంధించి 26 జిల్లాల్లో రెడ్‌క్రాస్ ద్వారా అత్యుత్తమ సేవలందించిన 11 మందికి గోల్డ్‌మెడల్స్ అందజేశారు. ఇందులో కొంతమంది ఐఏయస్‌లు కూడా ఉన్నారు. నెల్లూరు జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాక, వ్యక్తిగతంగా 25 లక్షల రూపాయలను రెడ్‌క్రాస్‌కు విరాళంగా అందించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ, ప్రజలకు రెడ్‌క్రాస్ చేస్తున్న సేవలను కొనియాడారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర ఛైర్మెన్ శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఏ.కె ఫరీదా పాల్గొని, రాష్ట్రంలో నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ చేస్తున్న సేవలను గురించి గవర్నర్‌కు వివరించారు. దేశంలోనే నెల్లూరు జిల్లా రెడ్‌క్రాస్ ఉత్తమస్థాయి సేవలు నిర్వహిస్తున్నదని గవర్నర్‌కు వారు తెలియజేశారు.



## నేదురుమల్లికి నివాళి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ శ్రీ నేదురుమల్లి జనార్ధనరెడ్డి 9వ వర్ధంతి సందర్భంగా వాకాడులోని వారి నివాసంలో ఈనెల 9న ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మెన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.

# ఆపదలో అక్షరం

(మొదటి పేజీ తరువాయి)

దినపత్రికల ప్రాముఖ్యత పెరిగిపోయింది. మారుతున్న కాలంతో పోటీపడుతూ ఎప్పటికప్పుడు ఆధునికతను సంతరించుకుంటూ పత్రికా రంగం కూడా మారుతూ కొత్త విధానాలతో రూపాంతరం చెందుతూ వచ్చింది. ప్రపంచ యుద్ధాలు జరిగే కాలంలోనూ, స్వాతంత్ర్య సమరంలోనూ పత్రికలూ అత్యంత కీలకపాత్ర పోషించాయి. క్రమేణా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా టి.వీలలో వార్తలు ప్రసారం కావడం, వందల కొద్దీ ఛానెళ్ళు పుట్టుకు రావడం మనకు తెలిసిందే. అయితే, ఇప్పుడు మనిషి జీవితంలో అంతర్జాలం అంతర్భాగమై సామాజిక మాధ్యమాలలో వందలకొద్దీ వార్తా బ్లాగులు, వేలకొద్దీ యూట్యూబ్ ఛానెళ్ళు రావడంతో సమాచార వ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు ప్రజలకి, ప్రభుత్వాలకి అవసరమైన సమాచారాన్ని మాత్రమే చేరవేసే ప్రచార మాధ్యమాలు ఇప్పుడు వ్యక్తిగత దూషణలకు, అవాస్తవ ప్రచారాలకు వేదికలుగా మారిపోయాయి.

### కలాన్ని కట్టడి చేస్తున్న ప్రభుత్వాలు

అనేక మీడియా సంస్థలు వాటి యాజమాన్యాలు సైతం తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పక్షపాత ధోరణితో తమ సంస్థలను తాకట్టుపెట్టడంతో సమాచార వ్యవస్థ స్వరూపమే పూర్తిగా మారిపోయింది. తమ కళ్ళతో చూస్తే తప్ప ఏది నిజమో ఏది అబద్ధమో తెలుసుకోలేని అయోమయ స్థితిలో ప్రజలు ఉండిపోయే పరిస్థితి ఏర్పడింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఎక్కడ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి అనుకూలంగా వార్తలు రాయాలన్న వత్తిడి మీడియా సంస్థలపైన పెరుగుతోంది. "మీరు మాకు అనుకూలంగా రాయకపోయినా పరవాలేదు, వ్యతిరేకంగా రాస్తే మాత్రం శంకరగిరి మాన్యాలు పట్టిస్తాం... అక్రమ కేసులు పెట్టి ఊచలు లెక్కబెట్టిస్తాం" అంటూ జాతీయ స్థాయి నాయకుడి నుండి గల్లీస్థాయి కార్యకర్త వరకు బెదిరించి భయపెట్టే వాతావరణం ఏర్పడిపోయింది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలైతే ఒకడుగు ముందుకేసి జర్నలిస్టులపై సిఐడి పోలీసులను ప్రయోగిస్తున్నాయి. తమ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను చూసి ఆ పార్టీ నాయకులు కూడా చొక్కాలు చించుకుంటున్నారు. "దమ్ముంటే మాపైన వార్తలు రాయండి, మీరు బయట ఎలా తిరుగుతారో చూద్దాం" అంటూ సవాళ్లు విసురుతున్నారు. చిన్నపత్రికల పరిస్థితయితే మరీ అధ్వాన్నంగా మారిపోయింది. మంత్రి హోదాలో ఉన్న వాళ్ళు సైతం "రేపు సాయంత్రానికి పత్రిక మూయించేస్తా, నిన్ను మీ బాసుని కాళ్ళు విరగ్గొట్టి లోపల కుర్చోపెడతాం' అంటూ సంస్థలో పనిచేసే వారిని బెదిరించే నీచ సంస్కృతికి శ్రీకారం చుడుతున్నారు. తమ అక్రమాలను ప్రశ్నించి వార్త రాస్తే సామాజిక మాధ్యమాలలో నీచమైన పోస్టింగులు పెట్టించి పైశాచిక ఆనందం పొందుతున్నారు.

జాతీయ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు ఇదే పరిస్థితి. ప్రతీచోట ఇదే పోకడ. చరిత్రాత్మకమైన మీడియా వ్యవస్థ చరిత్ర గర్భంలో కలిసిపోనుందా...? అని అనుమానం కలిగేలా ప్రభుత్వాలు, నేతల పోకడ కనపడుతోంది. ఇదే సంప్రదాయం కొనసాగితే చిన్నపత్రికల మనుగడ ప్రశ్నార్థకమే. ఇప్పటికే చాలా మీడియా సంస్థలు, పత్రికలూ ఒక్కొక్కటిగా మూత పడుతున్నాయి. నైతిక విలువలతో, నిబద్ధతతో వార్తాసంస్థలు నడిపే వారికి రక్షణ లేదు. ఒకప్పుడు తప్పుచేస్తే మీడియాలో వస్తుందేమో అని నేతలు భయపడేవారు. ఇప్పుడు వాళ్ళ తప్పులు ఎత్తిచూపితే తమ తుప్పు వదలకొడతారేమో అని మీడియా ప్రతినిధులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి.

అక్షరానికి ఆపద వచ్చింది. పత్రికా రంగం ప్రమాదంలో పడింది. అధికారం, అహంకారం ఏకమై దౌర్జన్యాలకు శ్రీకారం చుడుతున్నాయి..! ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న మీడియా మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులకు దారి తీస్తున్న ఇలాంటి సంస్కృతి, సంప్రదాయం మంచిది కాదన్న చర్చ ఇప్పటికే మేధావులలో మొదలవడం గమనార్హం...!

ఈ పరిస్థితుల నుంచి మీడియా రక్షణకు ఏం చేయాలి అనే అంశంపై విస్తృత స్థాయిలో చర్చలు జరగాల్సి ఉందని విశ్లేషకులు అంటున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, సామాజిక యాక్టివిష్టులు, వైద్యులు, న్యాయ వ్యవస్థలోని వారు, విద్యాధిక మహిళలు, రిటైర్ అయిన సివిల్ సర్వెంట్‌లు మొదలైన అన్ని వర్గాలకు చెందిన సామాజిక స్పృహ కలిగిన వారితో ఈ చర్చా వేదికల నిర్వహణ జరగాలి. సమాజ గమనం ఈరోజుతోనే ముగిసిపోవడం లేదు కదా! వారి పోకడలు చూస్తుంటే, రేపు అన్నది ఉన్నదనే విషయం మన నేతలు మరిచిపోతున్నారా? అనిపిస్తుందని ఒక ప్రముఖ విశ్లేషకుడు వ్యాఖ్యానించారు.

మరి, పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు...?

35 Years of Academic Excellence.... ESTD : 1988
VISWASAI
Dr.SRK.SCHOOL
(Recognised by the Govt of A.P)
Magunta Layout, MSR Nagar, Nellore - 524 003.
Cont: 0861-2325199, Cell: 9951125173, 8977178176.
www.drsrkschools.com
Play Class to X Class
Why Choose Viswasai Dr. SRK School?
- Comfortable timings (8:40 AM to 4.40 PM).
- Well Experienced Staff.
- Stress free Education.
- Spacious Play ground, Lab, Library, Digi Lab, Computers, Sports, Games, Cultural and Literary Activities.
- Special emphasis on Communication Skills.
- All round development of the child.
Enquire, Visit, Know the facts and Decide
Admissions are opened for 2023 – 24.

లాయర్
మే 12, 2023

# ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు అంతే లేదా?..

ప్రపంచమంతా 'ఆన్‌లైన్'లోకి వెళ్లిన వేళ, ఇదే అదనుగా ఆర్థిక మోసాలు కూడా జడలు విప్పుతున్నాయి. నెట్‌లో ఆన్‌లైన్‌లో అన్నీ దొరుకుతున్న నేటి సమాజంలో సైబర్ మోసగాళ్ళ దందా కూడా పెరిగిపోతోంది. నెట్ లేనిదే ప్రపంచమే లేదిప్పుడు. సెల్‌ఫోన్ లేని వారు బహుఅరుదు. విజ్ఞానం, వినోదంతో పాటు ఎన్నో అభివృద్ధి అవకాశాలను చేతికందిస్తోంది నెట్. అన్ని దేశాలను ఏకం చేసి, ఆన్‌లైన్ సేవలతో ప్రపంచాన్నే అరచేతికి అందిస్తోంది. అంతర్జాల (నెట్) సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు కూడా అందుబాటులోకి రావడం ఎంతైనా విశేషమే. ప్రపంచంలో దాదాపు 525 కోట్ల మంది ప్రజలు నెట్ వినియోగించుకుంటున్నారంటే నెట్ ఎంత విశేష ప్రాధాన్యత పొందుతోందో అవగతమవుతుంది. మనదేశంలో కూడా నెట్ వినియోగదారుల సంఖ్య రానున్న రెండేళ్ళలో కనీసం 90 కోట్లు దాటుతుందనే అంచనాలు కూడా ఉన్నాయి. మహానగరాలు, పట్టణాల్లోనే కాదు, మారుమూల పల్లెప్రాంతాలకు కూడా నెట్ శరవేగంగా విస్తరిస్తూనే ఉంది. అంతా బాగానే ఉంది కానీ, పాలల్లో విషపుచుక్కలు కలిసినట్లు అంతమంచి అంతర్జాలంలో కూడా మంచితో పాటు చెడు కూడా కలసిపోతోంది. అందువల్లనే, ఏది మంచో ఏది చెడో ఆలోచించకుండా అత్యుత్సాహం ప్రదర్శిస్తే వినియోగదారులకు చివరికి మిగిలిది కష్టనష్టాలే. అరచేతిలోకి ప్రపంచం వచ్చేసిందని అందరూ మహా సంబరపడిపోతుంటే, మోసాలు కూడా 'నెట్' ముసుగు కప్పుకుని అమాయకులైన యూజర్లను లేదా వినియోగదారులను అత్యంత సునాయాసంగా బురిడీ కొట్టించేస్తున్నాయి. రకరకాల యాప్‌లు, అనేకరకాల మోసపూరిత ప్రకటనలు నెట్ యూజర్లను బుట్టలో వేసుకుంటున్నాయి. అందినకాడకి మోసం చేసి తమ పబ్బం గడుపుకుంటున్నాయి. రుణాల పేరుతో యువతను లోబరుచుకుని, ఆ తర్వాత వేదించి అనేకమంది బలవన్మరణాలకు కారకులవుతున్నాయి కొన్ని రకాల మోసపు రుణయాప్‌లు. నేటికీ ఎంతోమంది ఆ యాప్‌ల అకృత్యాలకు నానా బాధలు పడుతూనే ఉన్నారు. అలాంటి సైబరాసురుల భరతం పట్టడానికి పోలీసులు, ప్రభుత్వ సంస్థలు కృషి చేస్తూనే ఉన్నా, ఎవరు అమాయకంగా దొరికితే, వారిని మోసకారులు ముంచేస్తున్నారు. అందులోనూ ప్రపంచంలో అమాయకులెవరంటే భారతీయులేనని బెంచీ ఎక్కి చెప్పుకునే పరిస్థితి. అందుకే మోసపోయేవాళ్ళ లెక్కలో భారతీయులే ఎక్కువగా ఉంటున్నారు. తాజాగా 'లోకల్స్ సర్వే' అనే సంస్థ దేశవ్యాప్తంగా 331 జిల్లాల్లో సర్వే చేసి ఆన్‌లైన్‌లో ఆర్థికంగా మోసపోతున్న వారిని పరిగణనలోకి తీసుకుంది. గత మూడేళ్లలో ఆన్‌లైన్ ఆర్థిక మోసాలకు గురౌతున్న భారతీయుల కుటుంబాలు దాదాపు 39 శాతం మంది ఉన్నారని అంచనా వేసింది. ఇందులో కూడా క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డుల పేరిట జరుగుతున్న మోసాలకు గురవుతున్నవారు మరింతమంది ఎక్కువగా ఉన్నారని, 66శాతం మంది పురుషులు, మరో 34 శాతం మంది మహిళలు ఈ మోసాలతో నష్టపోతున్నారని ఆ సంస్థ సర్వేలో గుర్తించారు. ఆన్‌లైన్‌లో డబ్బు లావాదేవీలు జరుపుతున్న వారిలో దాదాపు 13 శాతం మంది మోసపోయి ఉన్న డబ్బునంతా పోగొట్టుకున్నారని, మరో 13శాతం మంది ఉత్పత్తులకు సంబంధించి ముందుగానే డబ్బులు కట్టి, ఆ సరుకులు రాక మోసపోయారని సర్వేలో వెల్లడైంది. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రభుత్వాలు, బ్యాంకులవారు, వివిధ సంస్థలవారు చేస్తున్న ప్రచారాలతో ఎంతోమంది ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటూ మోసాలకు గురికాకుండా తమను తాము కాపాడుకుంటున్నారు. వారు చేస్తున్న ప్రచారాలు మంచి ఫలితాలనిస్తున్నాయి కూడా. పోలీసులు, నిఘాసంస్థలు ఎంతగా కన్నేసి ఉంచినా సైబరాసురులు సరికొత్త మోసాలకు తెరతీస్తూనే ఉన్నారు. ఆన్‌లైన ఆర్థికమోసాలను అరికట్టేందుకు టెలికాం సంస్థలు తీసుకుంటున్న చర్యలను కనిపెట్టి, కొత్త ఎత్తులు వేస్తూ అంతర్జాతీయ నంబర్ల వాట్సాప్ కాల్స్‌తో కూడా కొత్త దోపిడీలకు పాల్పడుతూనే ఉన్నారు. వీడియో కాల్ చేసి, అశ్లీల దృశ్యాలను వాట్సాప్‌లలో పంపి వాటిని డిస్‌కనెక్ట్ చేసే లోపే స్క్రీన్ రికార్డింగ్ చేసి, ఆ తర్వాత ఆ వినియోగదారుడిని బ్లాక్‌మెయిల్ చేసి భయపెట్టి డబ్బు గుంజుతున్నారు. ఈ కాల్స్ ఏ దేశం నుంచి లేదా ఎక్కడినుంచి వస్తున్నాయో తెలుసుకోవడం అసాధ్యం కనుక, సైబరాసురులు ఈ కొత్త మోసాలతో నెట్ వినియోగదారుల్ని ముంచేస్తున్నారు. ఈ అర్థిక మోసాలకు అసలు అంతే ఉండడం లేదు. చిటికెలో జరిగిపోయే ఈ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండడం మినహా మరోదారి లేదు. కనుక, నెట్ వినియోగదారులూ తస్మాత్ జాగ్రత్త!..

# కుప్పలకొద్దీ పెండింగ్ కేసులు
# ఏళ్ళ తరబడి దొరకని పరిష్కారాలు



సమాజంలో పెద్ద సమస్యలుగా ఉన్నవాటిలో నానాటికీ పెరుగుతున్న పెండింగ్ కేసుల సమస్య ఒకటి. అనేక విషయాలు, అనేకానేక కారణాలతో ఈ సమస్యలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయే కానీ, తరగడం అన్నది ఉండడం లేదని ప్రజల ఆవేదన. కోర్టుల్లో కేసులు పెరుగుతున్నా, పరిష్కారం విషయంలో ఏళ్ళతరబడి జాప్యం జరుగుతున్నదే తప్ప సత్వర పరిష్కారం కుదరడం లేదు. దీంతో కక్షిదారులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ సమస్య ఏదో ఒక జిల్లాకో రాష్ట్రానికో పరిమితం కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. దాదాపు 5 కోట్ల వరకు పెండింగ్ కేసులు పెరిగే పరిస్థితి ఉందని గతంలో కేంద్ర న్యాయశాఖ మంత్రే ఆందోళన వ్యక్తం చేసివున్నారు. దీంతో, ఒక్కో రాష్ట్రంలో పెండింగ్‌కేసుల సంఖ్య లక్షల్లోనే ఉంటుందని ఊహించవచ్చు.

దేశంలో ప్రతిప్రాంతంలో కోర్టులు ఉండనే ఉన్నాయి. కానీ న్యాయమూర్తుల నియామకాల ప్రక్రియ సుదీర్ఘమైనది కావడం, అనేక చోట్ల న్యాయమూర్తుల ఖాళీలు భర్తీ కాకపోవడం, అనేక కోర్టుల్లో మౌలిక సదుపాయాలు తగినంతగా లేకపోవడం, సిబ్బంది కొరతగా ఉండడం తదితర కారణాలతో పెండింగ్ కేసులు ఏళ్ల తరబడి కోర్టుల్లో నానుతున్నాయి. మొత్తంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల సంఖ్య కోట్లల్లోనే ఉండడం గమనార్హం. ప్రపంచంలో అత్యధిక సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న కోర్టు కోసులు మనదేశంలోనే ఎక్కువన్నది నిపుణుల అంచనా. ఈ కేసులన్నీ ఎప్పటికి పరిష్కారం అవుతాయో అంచనా వేయలేకపోతున్నారు. కోర్టుల్లో ఏళ్ళతరబడి కేసులు పరిష్కారం కాకపోవడం వల్ల బాధితులకు, లేదా కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగలేక నానా యాతనలు పడుతున్నారు. న్యాయమూర్తుల సంఖ్యను పెంచాలని, కోర్టుల్లో పెండెన్సీ తగ్గించాలని సుప్రీంకోర్టు ఎంతోకాలం నుంచి చెప్తూనే ఉంది. కేంద్ర ప్రభుత్వంతో పాటు, ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు అందుకు తగ్గ ప్రయత్నాలన్నీ

## సమస్యల తో 'రణం'

చేస్తూనే ఉన్నాయి కానీ, అవింకా ఆశించినస్థాయిలో ఒక కొలిక్కి రావడం లేదు. న్యాయవ్యవస్థ బలోపేతంగా ఉండేందుకు, అన్ని విధాలా పటిష్టమైన ఏర్పాట్లకు చాలినంత నిధులు ఉండడం లేదు. సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచమంతటా శరవేగంగా విస్తరిస్తున్నా, నేటికీ మన కోర్టుల్లో న్యాయమూర్తులకు, అధికారులకు తగినంత సౌకర్యాలు లేకపోవడం ఒక పెద్ద వెలితిగానే ఉంటోంది. కారణాలెన్నున్నా, కోర్టుల్లో జరుగుతున్న అనివార్యపు కాలయాపన వల్ల సత్వర న్యాయం ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. ఒక కేసులో పట్టుకున్న వాహనాలు, ఆ కేసు పరిష్కారం అయ్యేసరికి తుప్పు పట్టిపోతున్న సంఘటనలు అనేకం. ఒక కేసులో దొరికిన నిందితులు ఆ కేసు పూర్తిస్థాయిలో పరిష్కారం అయ్యేలోగా వృద్ధాప్యంలోకి రావడమో లేదా కారణాంతరాల వల్ల మరణించడం కూడా జరుగుతున్న సంఘటనలూ అందరం వింటున్నవే. అనేక సివిల్ కేసుల విషయంలో కూడా జాప్యం వల్ల సమస్యలు మరింతగా పెరుగుతున్నాయి. సుధీర్ఘకాలం కేసులు పరిష్కారం కాకపోవడంతో సామాన్య ప్రజలు కష్టనష్టాలకు గురవుతున్నారు.

### లోక్ అదాలత్‌లతో ఎంతో మేలు :

ఈ నేపథ్యంలో, కక్షిదారులు సామరస్యపూర్వకంగా కేసుల విషయంలో బాగా ఆలోచించుకుని రాజీకి వస్తే వాటిని వెంటనే పరిష్కరించుకోగలిగే సదుపాయల లోక్ అదాలత్‌లలో ఉండడం, లోక్ అదాలత్‌లలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధికారులు అందరూ కలసి ఎంతో శ్రమించి లక్షలాది కేసులను పరిష్కరిస్తుండడం, దీంతో సామాన్యులకు కూడా లోక్‌అదాలత్‌లలో సత్వరన్యాయం అందుబాటులోకి వస్తుండడం గొప్ప విశేషం. లోక్ అదాలత్‌లతో పేదలు, సామాన్యులకు ఎంతో మేలు జరుగుతోంది. కేసుల్లో ఉన్నవారికి ఎంతో ఊరట కలుగుతోంద. ఎంతోకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలు, ఎన్నో రకాల సివిల్, క్రిమినల్ కేసులు, కుటుంబ సమస్యలు, యాక్సిడెంట్ల కేసుల్లో పరిహారం ఇప్పించడం వంటి ఎన్నో కేసుల్లో పరిష్కారం సులభతరంగా అందుబాటులోకి వస్తుండడం పట్ల కక్షిదారుల్లో లోక్ అదాలత్‌ల పట్ల సంతోషం వ్యక్తమవుతోంది. ఏదేమైనా, కోర్టుల్లో కేసులు దీర్ఘకాలంగా, కోట్లాదిగా పేరుకుపోవడం వల్ల సామాన్యులకు సత్వర న్యాయం అందని ద్రాక్షలా ఉంటోందని ప్రజల్లోనే కాదు, న్యాయవర్గాల్లో కూడా ఆవేదన ఉంది. ఏళ్ళ తరబడి కేసులు పెండింగ్‌లో ఉండడం వల్ల శిక్షలు పడకుండా, జైళ్లల్లో అండర్ ట్రయల్స్‌గా ఉన్నవారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంటోంది. కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారి కష్టాలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఈ సమస్యలన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఇకనైనా, దేశవ్యాప్తంగా న్యాయస్థానాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీచేయడం, అవసరమైన సదుపాయాలకు కొరత లేకుండా నిధులందించడం, మొత్తంగా న్యాయవ్యవస్థను అన్నివిధాలా పటిష్టవంతం చేయడం వంటివి తక్షణం చేపట్టాల్సిన కార్యక్రమాలు. యుద్ధప్రాతిపదికన కేంద్రప్రభుత్వం ఇలాంటి చర్యలు తీసుకుంటే తప్ప ఈ పెండింగ్ కేసుల సమస్య ఒక కొలిక్కి రాదు మరి!..

- సంచారి

# దొంగలు బాబోయ్.. దొంగలు

ఇంటికి తాళం వేసి వెళ్తే ఇల్లు భద్రంగా ఉంటుందనుకుంటే ఇంతే సంగతులు. దొంగలు కాచుకుని ఉంటున్నారు. ఇంటికి తాళం వేసి వెళ్తే చాలు, నిర్భయంగా తాళాలు పగలగొట్టి ఇల్లంతా దోచుకుపోతున్నారు. జిల్లాలో దాదాపు సంవత్సరకాలంగా తాళం వేసిన ఇళ్ళలో దర్జాగా ఇలాంటి దొంగతనాలు జరిగిపోతూనే ఉన్నాయి. కానీ, ఆ దొంగలను మాత్రం కనిపెట్టలేకపోతున్నారు. దొంగలు పగలంతా తిరుగుతూ తాళం వేసివున్న ఇళ్ళను కనిపెట్టి, ఏ అర్ధరాత్రో వచ్చి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్నట్లుంది. జిల్లాలో ప్రతిరోజూ ఎక్కడోఒకచోట ఇలాంటి దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. కేసులు నమోదవుతూనే ఉన్నాయి. అయినా, ఈ చోరీలను అరికట్టడం జిల్లా పోలీసు యంత్రాంగానికి ఒక పెద్ద సవాల్‌గా పరిణమించింది. ఈ దొంగతనాల వెనుక, ఏదో పెద్ద ముఠా ఉన్నట్లుంది. తాళాలు పగలగొట్టడంలో సిద్ధహస్తులైన దొంగలు సులభమైన ఈ కొత్తమార్గాన్ని ఎనుకున్నట్లుంది. ఇళ్లల్లో ఉన్నవాళ్ళు తాళం వేసి వెళ్ళిపోయి ఉంటారు కనుక, దొంగలు ఎలాంటి భయం లేకుండా దర్జాగా చోరీలు చేసేస్తున్నారు. ఇళ్ళల్లో ఉన్న డబ్బూదస్కం ఊడ్చుకుపోతున్నారు. ఆ తర్వాత, పోలీసులు వచ్చి పరిశీలిస్తున్నారు కానీ, దొంగలు మాత్రం దొరకడం లేదు. ప్రత్యేక పోలీసులు, నిఘాబృందాలతో ఖచ్చితమైన దర్యాప్తు చేస్తే తప్ప ఆ దొంగల ఆచూకీ దొరికేట్లు లేదు.

ఎంత సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా ఇలాంటి చోరీల పోబిడీ తెలియడం లేదంటే విచిత్రమే. దాదాపు ఏడాదిగా ఈ దొంగతనాలు పెరిగిపోతూనే ఉన్నాయి. జిల్లాలో ఎన్ని తాళంవేసిన ఇళ్ళు చోరీలకు గురయ్యాయి.. ఎంత సొత్తు దొంగలు దోచుకుపోయారన్నది లెక్క తీస్తే..ఈ దొంగతనాలు ఏ స్థాయిలో జరిగిపోతున్నాయో తెలుస్తుంది. అయినా, తాళం వేసి వెళ్తే కూడా ఇళ్ళల్లో దొంగతనాలు జరుగుతుండడం..ఇంత అభద్రత నెల్లూరుజిల్లాకు ఎప్పుడూ లేదు. ఇంత బరితెగింపు దొంగతనాలు ఎప్పుడూ లేవు. నిఘా విభాగం పోలీసులు గట్టిగా దృష్టి సారిస్తే.. ఇలాంటి దొంగలను పట్టుకోవడం ఏమంత కష్టం కాదు! ఎలాగైనా సరే ఈ దొంగతనాలను అరికట్టాలని కోరుకుంటున్నాము.

కెవిఎస్ఎల్ రావు, కావలి.




## రైతుల బకాయిలు
# ఇంకెప్పుడు తీరుస్తారు?

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి ప్రభుత్వం గత సీజన్‌లో ఇవ్వాల్సిన డబ్బులు ఇంకా ఇవ్వలేదు. ఇంకా ఎప్పుడు ఆ బకాయిలు చెల్లిస్తారో తెలియడం లేదు. రైతులకు రవాణా చార్జీలు, హమాలీ చార్జీలను ప్రభుత్వమే చెల్లిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నారు. గత సీజన్‌లో, అంటే 2022 మార్చి నెలలో మొదటి పంట కొనుగోళ్ళకు సంబంధించిన ఆ డబ్బులు ఇప్పటికీ ఇవ్వకపోవడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. జిల్లాలో రైతులకు సుమారు 15కోట్ల రూపాయల దాకా రావాల్సిఉంది. ఆ మొత్తం చెల్లిస్తామని ఎప్పటికప్పుడు అధికారులు భరోసా ఇస్తున్నారు. కానీ, డబ్బులు మాత్రం రావడం లేదు. అసలే పేదరైతులు కష్టాల్లో ఉన్నారు. ఆదుకోండి సారూ!...

ఎం.వెంకటనరసయ్య, ముత్తుకూరు.

### సచివాలయ సిబ్బంది..

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

**- జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ**



సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని నెల్లూరుజిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదేశించారు. ఈనెల 10న ఆమె నెల్లూరురూరల్ మండలంలోని 12వ డివిజన్ చింతారెడ్డిపాళెంలో ఏసీసుబ్బారెడ్డి భవనంలో తాత్కాలిక సచివాలయ వార్డు భవనాన్ని ప్రారంభించారు. త్వరలోనే ఇక్కడ కొత్త సచివాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, పూర్తిస్థాయిలో సిబ్బందిని కూడా నియమించడం జరుగుతుందని అరుణమ్మ చెప్పారు. డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డాక్టర్ జయప్రదకు..

# హైదరాబాద్‌లో సన్మానం



మాతృదినోత్సవం సందర్భంగా ఈనెల 11వ తేది గురువారం హైదరాబాద్‌లో నెల్లూరు నవలారచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయ ప్రదకు సన్మానం జరి గింది. శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం -భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'షష్టిపూర్తి కలాలకు' (60 ఏళ్ల దాటిన కవయిత్రులకు) సన్మానాలు చేశారు. 'మాతృ వందనం' పేరుతో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పెళ్ళకూరు జయప్రద పాల్గొని ఘనసత్కారం అందుకోవడం విశేషం.

ఈ సందర్భంగా కవయిత్రిగా, నవలా రచయిత్రిగా, ప్రముఖ వైద్యురాలిగా డాక్టర్ జయప్రద చేస్తున్న బహుముఖ సేవలను నిర్వాహకులు కొనియాడారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్య క్షులు ఆచార్య తంగెడ కిషన్‌రావు అధ్యక్షత్వంలో జరిగిన ఈ సన్మానసభలో ఆంధ్ర మహిళా సభ నర్సింగ్ కళాశాల ఛైర్‌పర్సన్ ఆచార్య ఎం.సులోచన ముఖ్యఅతిథిగా, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మామిడి హరికృష్ణ, చిత్రవాణి స్టూడియో డెప్యూటీ డైరెక్టర్ అయినంపూడి శ్రీలక్ష్మి తదితర ప్రముఖులు పాల్గొని డాక్టర్ జయప్రదను సన్మానించి అభినందించారు.

# ఉత్సాహంగా.. రెడ్ క్రాస్ దినోత్సవం




ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మే 8న ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం ఉత్సాహంగా జరిగింది. రెడ్‌క్రాస్ ఉద్యమ వ్యవస్థాపకుడు జీన్-హెన్రీ డ్యునాంట్ జయంతిని పురస్కరించుకుని ఆరోజున ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ సంవత్సర "మనం చేసే ప్రతి పని..హృదయం నుండి వస్తుంది" అనే అంశాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆ నినాదంతో రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా ఛైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచనల మేరకు రెడ్‌క్రాస్ ప్రతినిధులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గరనుండి రెడ్‌క్రాస్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. అనంతరం రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్‌లో జీన్-హెన్రీ డ్యునాంట్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్లకు, వారి సహాయకులకు 500 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసి, సుమారు వంద మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్, యడవల్లి సురేష్, గునపాటి ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్లు ఎం.వి.సుబ్బారెడ్డి, టి.భాస్కర్ రెడ్డి, డాక్టర్.వి.వేణు, కో-కన్వీనర్లు షేక్ పర్వీన్, టి.సురేష్, ఏ.వి.రమణయ్య, రెడ్‌క్రాస్ నెల్లూరు జిల్లా కార్యదర్శి పి.మస్తానయ్య, క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.ఎం.నాగేశ్వరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మి, గీత, ఉషశ్రీ, రమేష్‌బాబు, హరితారాణి, జనరల్ మేనేజర్ ఎం.డి.జుబైర్, కన్యాకుమారి, ఎన్.వేణుగోపాల్‌రావు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎం పర్యటనకు.. భారీ భద్రతా ఏర్పాట్లు



రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 12న కావలిలో పర్యటిస్తున్న నేపథ్యంలో కావలిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సిఎం పర్యటించనున్న ప్రాంతాల్లో పెద్దసంఖ్యలో పోలీసుల బందోబస్తుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం 1600 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10న జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలతో కలసి, ముఖ్యమంత్రి కార్యాలయం ఇంటెలిజెన్స్ అధికారి గోపాలకృష్ణ కావలి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను, సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించారు. సిఎం నిర్వహించనున్న బహిరంగ సభ ప్రదేశాన్ని, పార్కింగ్ ప్రదేశాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు.

### తలసేమియా చిన్నారులకు..

# అందుబాటులో అత్యాధునిక చికిత్సలు

**రెడ్‌క్రాస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్**




తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ-నెల్లూరు జిల్లా శాఖ అండగా ఉంటుందని, వారికి అధునాతన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్ తగు సహకారం అందిస్తుందని రెడ్‌క్రాస్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్. ఏ.యశోవర్ధన్ చెప్పారు. మే 10న నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యాలయంలో జరిగిన అంతర్జాతీయ తలసేమియా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తలసేమీయా వ్యాధి గ్రస్తులకు అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈవ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. రెడ్‌క్రాస్ తలసేమియా ప్రాజెక్టు కన్వీనర్ డాక్టర్ ఎస్.సీత మాట్లాడుతూ రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్‌లో నమోదు చేసుకున్న చిన్నారులందరూ తలసేమియా వ్యాధినుంచి పూర్తిస్థాయిలో కోలుకునేందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. తలసేమియా చిన్నారులకు వారంలో ఒక రోజు ఉచితముగా వైద్యంఅందిస్తున్న డాక్టర్ యు.రమ్య సేవలను ఆమె ప్రశంసించారు. అందుకు సహకరిస్తున్న సేవా సంస్థలు లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రియదర్శిని, మహాయోగ ట్రస్ట్, బి.ఎం జి ఫౌండేషన్, సంకల్ప్ ఫౌండేషన్, ప్యూర్ స్మైల్ ఛారిటీస్‌లతో పాటు సహకరిస్తున్న డాక్టర్లను, సేవాభావంతో పని చేస్తున్న వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కోశాధికారి సురేష్‌కుమార్ జైన్, జిల్లా కార్యదర్శి పి.మస్తానయ్య, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, యడవల్లి సురేష్, డాక్టర్లు సి.హరిత, యు.రమ్య, శిరీష, ఎం.విష్ణువందన, కె.భార్గవి, పి.హరితారాణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం టైగర్ మహమ్మద్, రాజు ఆధ్వర్యంలో మ్యాజిక్‌షో నిర్వహించారు. ప్యూర్ స్మైల్ చారిటీస్ ఎస్.కె.పర్వీన్, మహా యోగ ట్రస్ట్ టీమ్ సంయుక్తంగా సుమారు 200 మందికి అన్నదానం నిర్వహించారు.

# బహిరంగ ప్రదేశాల్లో..చెత్త వేస్తే జరిమానా



బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా చెత్తాచెదారం వేస్తే జరిమానాలు విధించాలని నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ చెప్పారు. ఆ మేరకు మునిసిపల్ సిబ్బందికి ఆయన ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా నగరపాలక సంస్థ నిర్వహిస్తున్న ఇంటింటా చెత్తసేకరణకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. ఈనెల 10న ఆయన 51వ డివిజన్ సుబేదారుపేటలో శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనుమతులు లేకుండా విధులకు గైర్హాజరయ్యే సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, నోటీసులకు జవాబివ్వని సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని ఎంహెచ్‌ఓను ఆదేశించారు. యూజర్ చార్జీలను 90 నుంచి 40 రూపాయలకు తగ్గించడం జరిగిందని, ప్రజలు బాధ్యతగా ఆ చార్జీలను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కార్పొరేషన్ ఆరోగ్యాధికారి డా.పి.వెంకటరమణ, సూపర్‌వైజర్లు కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### గాలిగోపురానికి

# ఒకటిన్నర లక్షల విరాళం



కోవూరులోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం గాలిగోపురం నిర్మాణానికి కోవూరు వైస్ ఎంపిపీ శివుని నరసింహారెడ్డి ఈనెల 10న లక్షా 50వేల రూపాయల విరాళం అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సమక్షంలో ఆలయ ఛైర్మెన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డికి ఆ నగదును ఇచ్చారు. సచివాలయ కన్వీనర్ కవరగిరి ప్రసాద్, పిఏసిఎస్ ఛైర్మెన్ మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 12న..మాతృ దినోత్సవం



**'అమ్మ'పై కవిసమ్మేళనం**

అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా మే 12వ తేది శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం-నెల్లూరుశాఖ ఆధ్వ ర్యంలో 'అమ్మ' విశిష్టతపై కవిసమ్మేళనం జరుగుతుందని ఆ సంస్థ కార్యనిర్వాహకులు తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ కాలనీలో ఉన్న సూర్య స్కూల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ ఉపాధ్యాయిని, ఉత్తమ గృహిణిగా ఎన్నో అవార్డులు పొందిన గుడిపాటి విజితకు సన్మానం చేస్తున్నారు. నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు, ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, కవులు, కవయిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

# నెల్లూరు కబుర్లు



## దివ్యాంగుల కాలనీలో..
# సమస్యలు పరిష్కరిస్తాం

నెల్లూరులోని దివ్యాంగుల కాలనీలో సమస్యలను పరిష్కరిస్తామని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. 23వ డివిజన్లోని దివ్యాంగుల కాలనీలో ఇటీవల ఆయన రెండో రోజు గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో కొందరు దివ్యాంగులు పలు సమస్యలను తమ దృష్టికి తెచ్చారని. వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. కార్పొరేటర్ ఒరిస్సా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాతపాటి పుల్లారెడ్డి, యనమల మల్లికార్జునరెడ్డి, మస్తాన్‌రెడ్డి, శివయ్య, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, పెంచలరెడ్డి, జిలాని, బుఖారి, రమేష్ పాల్గొన్నారు. వీరితోపాటు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్ మూలే విజయ భాస్కర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, హరిబాబుయాదవ్, జడ్పిటిసి మల్లు సుధాకర్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ చలివేంద్రం



నెల్లూరులోని ఏసి స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న మంచినీరు, చల్లని మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎంవి సుబ్బారెడ్డి చేతులమీదుగా చలివేంద్రం ప్రారంభోత్సవం జరిగిందవి. వాకర్స్ నాయకులు ఏకొల్లు రాఘవరెడ్డి, నలుబోలు బల రామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. మజ్జిగ దాత తలపనేని హరిబాబునాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్‌అహమ్మద్, రీజనల్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర షెట్టి తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ విద్యార్థులకు సత్కారాలు

ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమఫలితాలు సాధించిన ఆరుగురు విద్యార్థులకు నెల్లూరు రంగనాయ కులపేటలోని పిఎంఆర్ మునిసిపల్ హైస్కూల్‌లో ప్రోత్సాహక నగదు పురస్కారాలు అందజేసి సత్కరించారు. జాలీఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సూర్యనారాయణ అధ్యక్షతన ఈనెల 9న ఈ కార్యక్రమం జరిగింది. జాలీఫ్రెండ్స్ సభ్యులు శరణ్‌కుమార్, సుబ్బయ్య, సునీల్‌కుమార్, వెంకటేశ్వర్లు, బాబ్జీ, ఫిజికల్ డైరెక్టర్లు కుమార్, శశిధర్, సుధీర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## 13-14 తేదీల్లో..
# హనుమాన్‌జయంతి

నెల్లూరులోని అవధూత దత్తపీఠాధిపతి పూజ్యశ్రీ శ్రీ గణపతి సచ్చిదానందస్వామి దత్తపీఠం ఉత్తరాధిపతి శ్రీ దత్త విజయానంద తీర్థస్వామీజీ ఆశీస్సులతో మే 13, 14వ తేదీల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు, ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలియజేశారు. దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలో ఉన్న శ్రీకృష్ణ యోగమందిరం, శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి దేవాలయాల్లో ఈ సందర్భంగా విశేష పూజలు జరుగుతాయన్నారు. 13వ తేది ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారని, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం ఉంటాయని, 14న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, గోపూజ, లక్ష నాగావళి దళార్చన, సా. 7గంటలకు పల్లకిసేవ నిర్వహిస్తామని, భక్తులు తరలివచ్చి స్వామివారి కృపను పొందాలని ఆయన కోరారు.

# 6 కేంద్రాల్లో 'నీట్'

ఎంబిబిఎస్, బిడిఎస్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 7న జరిగిన 'నీట్' పరీక్షలకు జిల్లాలో 3996 మంది విద్యార్థులు హాజరయ్యారు. 65 మంది పరీక్షలకు రాలేదు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షలకు అధికారులు కఠిన నియమ నిబంధనలు అమలుచేశారు. వస్త్రధారణ, ఆభరణాలపై కూడా ఆంక్షలు విధించారు. పరీక్షాకేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. మెటల్ డిటెక్టర్లతో విద్యార్థులను తనిఖీచేసి మరీ లోపలికి పంపారు. జిల్లాలో 6 కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగానే జరిగాయి.

## జిల్లా న్యాయమూర్తుల
# నివాస భవన సముదాయానికి శంకుస్థాపన



జిల్లా న్యాయమూర్తుల నూతన నివాస భవన సముదాయ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. నెల్లూరు నగరంలోని కిమ్స్ వైద్యశాల సమీపంలో న్యాయమూర్తుల నివాస భవన సముదాయ నిర్మాణాలకు కేటాయించిన స్థలంలో హైకోర్టు న్యాయమూర్తి డి రమేష్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. తొలుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా వర్చువల్‌గా శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా కోర్టు న్యాయమూర్తులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సభ జరిగింది. హైకోర్టు న్యాయమూర్తి రమేష్ మాట్లాడుతూ, రెండేళ్ళ క్రితం జిల్లా కోర్టుల్లో నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశామని, అవి త్వరలోనే నిర్మాణాలు పూర్తిచేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం కానున్నాయని చెప్పారు. అలాగే న్యాయమూర్తుల నివాస భవన సముదాయాన్ని కూడా వీలైనంత త్వరలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించి అందుబాటులో తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం, హైకోర్టు న్యాయమూర్తి రమేష్ దంపతులను న్యాయమూర్తులు ఘనంగా సత్కరించి మెమెంటో అందజేశారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వర్, స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ అన్వర్ బాషా, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# నేదురుమల్లి వర్ధంతినాడు.. డిసిసి వస్త్రదానం



దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని డిసిసి అధ్యక్షులు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 9న నగరంలోని ఇందిరాభవన్‌లో పేదలకు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దాయన నేదురుమల్లి తన తుదిశ్వాస వరకు కాంగ్రెస్‌పార్టీలోనే కొనసాగారని, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని తెలిపారు. కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి ఆయనెంతో సేవలు చేశారని కొనియాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇందిరాభవన్ ఇన్‌చార్జి బాలసుధాకర్, కాంగ్రెస్ నేతలు సీవీ శేషారెడ్డి, పయాజ్, శ్రీనివాసులురెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నమయ్యకు నివాళి



తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి జయంతిని పురస్కరించుకుని మే 6న నెల్లూరులోని శ్రీ శ్రీనివాస నాట్యమండలి వ్యవస్థాపక కార్యదర్శి, ప్రముఖ రంగస్థల నటుడు, 'అభినవ అన్నమయ్య' బిరుదాంకితుడు తిరుపతి హరగోపాల్ నెల్లూరులోని అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న అన్నమాచార్య విగ్రహానికి పూల మాలికలు వేసి నివాళులర్పించారు.





స్మృత్యంజలి

మీ జ్ఞాపకాలు అజరామరం..
మీ ఆశయాలు అమరం!
మీ స్మృతులతో...

కీ॥శే॥ శ్రీ కె.వి.రమణయ్య - శ్రీమతి రమాదేవి

| కుమారులు - కోడళ్లు | కుమార్తెలు - అల్లుళ్లు |
|---|---|
| కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన | సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి |
| కనుపర్తి దయాశంకర్ - రేణుక | జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహాశర్మ |

మనవళ్ళు, మనవరాళ్ళు మరియు మునిమనుమరాలు







## సిఎం సమక్షంలో బొమ్మిరెడ్డికి వైసిపి కండువా!

తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా జడ్పీ మాజీచైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైకాపాలో చేరారు. ఆయన వెంట తిరుపతి జిల్లా వైసిపి అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# రాజకీయాలకు అతీతంగా లబ్దిదారులకు పథకాలు

## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

ప్రజలకు సంక్షేమపథకాలు, రాష్ట్రానికి సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, రాజకీయాలకు అతీతంగా లబ్దిదారులకు ఇళ్ళవద్దకే పథకాలు అందుతుండడం పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 7న ఆయన కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీలోని డిసిఎన్ నగర్, వాగుమిట్ట తదితర ప్రాంతాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలు ఏమేరకు అందాయో స్వయంగా తెలుసుకోవడానికి వీలు కలుగుతోందని, తాను ఇప్పటివరకు 59 సచివాలయాల పరిధిలో ఈనెల 7 నాటికి మొత్తం 69348 ఇళ్ళు తిరిగామని, ఎక్కడికి వెళ్ళినా తమ ప్రభుత్వం పట్ల, సిఎం జగన్ పట్ల ప్రజల్లో ఎనలేని ఆదరణ కనిపిస్తోందని చెప్పారు. కోవూరు ఏఎంసి



చైర్మెన్ రాధాకృష్ణారెడ్డి, డిఎల్‌డిఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మెన్ ఆర్.మల్లికార్జునరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ ప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసి సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహులురెడ్డి, జలజీవన్ మిషన్ చైర్మెన్ భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినికి సత్కారం



కోవూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో జిల్లాలోనే అత్యధికంగా 586 మార్కులు సాధించిన షేక్ మదీనా అనే బాలికకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇటీవల సన్మానించారు. ఈ సందర్భంగా బెంగళూరు సిటీ లయన్స్ క్లబ్ తరఫున లయన్స్ క్లబ్ కార్యదర్శి ఆ విద్యార్థినికి 50 వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతి ప్రకటించారు. ఆ అమ్మాయి ఇంటర్మీడియట్ చదువుల కోసం ఈ సాయం అందించారు. పడడుగుపాడు పీఏసీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు కోల్పోయిన చిన్నారులకు సాయం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇందుకూరుపేట మండలం కొత్తూరు పంచాయతీలో పర్యటిస్తుండగా కొన్ని కుటుంబాల్లో కొంతమంది తల్లిని, మరికొంతమంది తండ్రిని కోల్పోయిన పిల్లలకు చూసి వారి భవిష్యత్తును దృష్టిలోపెట్టుకొని వారికి అండగా నిలిచారు ఎమ్మెల్యే ప్రసన్న. కొత్తూరు పంచాయతీలోని నెత్రంబాక పూజితకు రూ.20 వేలు, నెత్రంబాక వెంకట సునీతకు రూ.20 వేలు, పెళ్ళూరు ఉజ్వలకు రూ.20 వేలు, జాహ్నవికి రూ.20 వేలు, షేక్ అయాన్ భాష కు రూ.20 వేలు, తుమ్మలపూడి మహేందం కు రూ.20 వేలు... మొత్తం లక్షా 20 వేల రూపాయలను తన తండ్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ పిల్లలకు 18 సంవత్సరాలు వచ్చేంతవరకు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేయించి ఆ పత్రాలను వారి కుటుంబ సభ్యులకు ఇటీవల అందజేశారు.

# 'డైకిన్' పురోగతి అపూర్వం

## --- శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి ప్రశంస ---



శ్రీసిటీలో ఉన్న ఎయిర్ కండీషనర్ తయారీ సంస్థ 'డైకిన్' దేశీయ మార్కెట్లో బిలియన్ డాలర్ల టర్నోవర్ దాటినందుకు శ్రీసిటీ ఎం.డీ రవీంద్ర సన్నారెడ్డి ఇటీవల ప్రశంసించారు. డైకిన్ పురోగతిని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డైకిన్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కన్వాల్జిత్ జావాకు అభినందనలు తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరానికి ఒక బిలియన్ డాలర్ల మార్కును అధిగమించిన మొట్టమొదటి అంతర్జాతీయ కంపెనీగా డైకిన్ ఇండియా ఆవిర్భవించినందుకు తాను సంతోషిస్తున్నానని, కన్వాల్‌జీత్ జావా నాయకత్వంలో డైకిన్ ఇండియా కార్యకలాపాలు ప్రతి విభాగంలోనూ మార్కెట్ లీడర్‌గా నిలిచిందని ఆయనకు, డైకిన్ బృందానికి అభినందనలు తెలిపారు. ఉన్నత ప్రమాణాలు కలిగిన డైకిన్ ఇండియా ఎయిర్-కండీషనర్లు, మరియు కంప్రెషర్ల అతిపెద్ద తయారీ కేంద్రం శ్రీసిటీలో నెలకొల్పినందుకు గర్విస్తున్నామన్నారు. ఈ ఉత్పత్తి కేంద్రం ప్రారంభమైతే, రాబోయే సంవత్సరాల్లో భారతదేశంలో డైకిన్ ఇండియా వ్యాపారం రెండింతలై 2 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. డైకిన్ విజయ ప్రస్థానం ఇతరులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. యువతకు ఉపాధి కల్పనపై దృష్టి సారించి శ్రీసిటీలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ హబ్‌ని స్థాపించడానికి డైకిన్ చూపుతున్న చొరవ అత్యంత ప్రశంసనీయమన్నారు. డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రై.లి. పరిశ్రమ, జపాన్‌లోని డైకిన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ అని, అత్యాధునిక ఉత్పత్తులతో దేశీయ మరియు అంతర్జాతీయ డిమాండ్‌కు సేవలందించే ఫ్యాక్టరీని డైకిన్ ఇండియా శ్రీ సిటీలో ఏర్పాటు చేస్తోందని, 75.5 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ కొత్త ఫ్యాక్టరీ ఈ సంవత్సరం వాణిజ్య ఉత్పత్తికి సిద్ధంగా ఉందన్నారు. శ్రీసిటీలో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించనుందని, ఉద్యోగంలో శిక్షణ కూడా ఉంటుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, జపనీస్ తయారీ ప్రక్రియలో శిక్షణతో పాటు సాఫ్ట్ స్కిల్స్ శిక్షణను కూడా అందించడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు.

### దేవిరెడ్డి శారత ఉన్నత పాఠశాలలో..

## ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల



అల్లూరు మండలం నార్త్ మోపూరు స్థానిక దేవిరెడ్డి శారద ఉన్నత పాఠశాలలో 2023-2024 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు సుమారు 340 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదివే విద్యార్థులు పరీక్షకు హాజయ్యారు. అందులో ప్రతిభ కనపరచిన 60 మంది విద్యార్థులను వారి ఆర్థిక స్తోమత పరిశీలించిన అనంతరం అన్ని అర్హతలు కలిగిన వారిని సంస్థ ఎంపిక చేసి విద్యార్థుల పేర్లు ప్రకటించారు.

# 'తంగిరాల మహాభారతం' 54వ భాగం

విదురుడు పాంచాల నగరానికి వచ్చి ధృతరాష్ట్రుని ఆదేశం ప్రకారం, పాండవులని హస్తినాపురానికి ఆహ్వానించాడు. అప్పుడు కృష్ణుడు కూడా అక్కడేవుండి, విదురుడు మీకు హితోభిలాషి, ఆయన చెప్పింది సమ్మతమేనని ప్రోత్సహిస్తాడు. పాండవులు హస్తినాపురం వచ్చి పెద్దలకు పాదాభివందనం చేసి, వారి ఆశీర్వాదం తీసుకుని తమకు కేటాయించిన భవనాల్లో సుమారు 5 సంవత్సరాలు ఉంటారు. తర్వాత ధృతరాష్ట్రుడు ధర్మరాజుకి అర్ధరాజ్యం ఇచ్చి ఇంద్రప్రస్థంలో రాజ్య పరిపాలన కొనసాగించమని ఆదేశిస్తాడు. పాండవులు ఇంద్రప్రస్థానికి వెళ్లి, ఇంద్రుని ద్వారా విశ్వకర్మచే రాజధానిని నిర్మించి చక్కగా పరిపాలన కొనసాగిస్తాడు. ఒకసారి నారదుడు వచ్చి ద్రౌపది కోసం మీలో మీరు కలహించుకోకూడదని సుందోప సుందుల కథ చెపుతాడు. హిరణ్య వంశంలో నికుంభుడనే రాక్షసునికి సుందోపసుందులనే




ఇద్దరు కొడుకులున్నారు. ఒకరంటే ఇంకొకరికి ప్రాణం. అన్ని లోకాలను జయించాలని బ్రహ్మ గురించి తపస్సు చేసి చాలా వరాలు పొందుతారు. ఇక గర్వంతో దేవతలను, బ్రాహ్మణులను నానా హింస పెడుతుంటే వారు బ్రహ్మని శరణు కోరుతారు. బ్రహ్మ ఆజ్ఞమేరకు విశ్వకర్మ ఒక అపూర్వ సౌందర్యవతిని సృష్టిస్తాడు, ఆమె తిలోత్తమ. బ్రహ్మ ఆదేశం ప్రకారం ఆమె ఇద్దరు రాక్షసుల దగ్గరికి వెళ్లి వాళ్ళిద్దరిమధ్య పోట్లాట పెడుతుంది. వాళ్లిద్దరూ తిలోత్తమ కోసం భయంకరంగా యుద్ధంచేసి ఒకేసారి ప్రాణాలు వదులుతారు. ఇదంతా నారద ముని పాండవులకు చెప్పి మీకు ఇటువంటి కలహాలు రాకుండా దృఢ కట్టడి పెట్టుకొమ్మని సలహా ఇస్తాడు. ద్రౌపది క్రమక్రమంగా ఒక్కొక్కరితో సంవత్సరం పాటు నివసించాలి. ఆ సమయంలో మిగతా పాండవులు ఆమె అంతఃపురానికి వెళ్ళకూడదు. ఆలా వెళ్ళినచో, 12 నెలలు తీర్థయాత్రలు చెయ్యాలని కఠిననిర్ణయం తీసుకుంటారు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




# జిల్లాలో పెద్దఎత్తున 'సిలికా కుంభకోణం'

## అధికారుల అండతో కోట్లు దోచుకుంటున్న అక్రమార్కులు

### - మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి



ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని చిల్లకూరు, కోట మండలాల పరిధిలో మాత్రమే లభించే అత్యంత విలువైన, అరుదైన ఖనిజం సిలికాను అక్రమార్కులు పెద్ద ఎత్తున దోచుకుంటున్నారని, వైకాపా పాలనలో వారి బినామీలు అసలైన పేద లబ్ధిదారులను లీజుల పేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల ఆయన నెల్లూరులో పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ కుంభకోణాన్ని బయటపెట్టారు. సిలికాకు 76 మంది లీజుదారులున్నారని, అయితే వారి లీజులు వైకపా పాలనలో చెల్లడం లేదని, వారిని భయపెట్టి, ఆ లీజులను ఆపివేసి బినామీల పేరుతో టన్నులకు టన్నులు సిలికాను కాజేస్తున్నారని ఆయన మండిపడ్డారు. టన్ను సిలికాను వంద రూపాయలకే కొనుగోలు చేసి, దానిని అక్రమార్కులు 1485 రూపాయలకు అమ్ముకుంటున్నారని, అధికారిక లెక్కల్లో మాత్రం 700 రూపాయలుగా నమోదు చేస్తున్నారని, ఇంత ఘోరం ఎక్కడా లేదని ఆయన అన్నారు. గత నాలుగేళ్ళుగా సిలికాను అడ్డగోలుగా పక్క రాష్ట్రాలకు తరలించి వేలకోట్ల రూపాయలను దోచుకుతింటున్నారని దుయ్యబట్టారు. అక్రమంగా తవ్విన సిలికా రవాణాకు లీజుదారుల్లోని కొందరి పేర్లతో పర్మిట్లు తీసుకుంటున్నారని, వైకాపాలోని కొంతమంది ప్రముఖులకు అవి బినామీ కంపెనీలని ఆయన పేర్కొన్నారు. పేదలు అనాదిగా అనుభవిస్తున్న అసైన్‌మెంట్ భూముల్లో టన్నుకు కేవలం 30 రూపాయలు మాత్రమే ఇస్తూ, ఆ సిలికానంతా 1485 రూపాయలకు సొమ్ము చేసుకుంటున్నారని, అలా అక్రమార్కులు కోట్లకు కోట్లు దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. పర్యావరణ నిబంధనల ప్రకారం 2.5 మీటర్లే తవ్వాల్సివుండగా, అయిదారు మీటర్ల వంతున కూడా తవ్వేస్తున్నారని, భూముల నుంచి సొనకాలువల దాకా నామరూపాల్లేకుండా చేస్తున్నారని, వైకాపా పెద్దల బినామీ కంపెనీల తరఫున సంబంధిత శాఖ ఉన్నతాధికారి ఒకరు వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ సిలికా దోపిడీని నిరూపించేందుకు తాము సిద్ధమని, వారు తమ నిజాయితీని నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారా అని మైనింగ్‌శాఖ డైరెక్టర్‌నుద్దేశించి సోమిరెడ్డి సవాల్ విసిరారు. రాష్ట్రంలో మైనింగ్ మాఫియా రాజ్యమేలుతుంటే ఆ శాఖ డైరెక్టర్ వాటిని సమర్థించుకోవడం దురదృష్టకరమన్నారు.



# నేదురుమల్లి సేవలు చిరస్మరణీయం

మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత స్వర్గీయ నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి 9వ వర్ధంతి కార్యక్రమం ఈనెల 9వ తేదీన కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని నేదురుమల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనార్దన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు ఎనలేని సేవలందించారని వారి సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. నేదురుమల్లి తనయుడు, ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కళాశాల పురోగతి అద్భుతంగా ఉందన్నారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా రామ్‌కుమార్‌రెడ్డి కళాశాలను తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేదలకు సరుకుల పంపిణీ

పేదలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అధ్యక్షులు ధనంజయరెడ్డి తెలిపారు. సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్దారెడ్డి సుధీర్‌రెడ్డి దాతృత్వంతో ఈ నెల 7వ తేదీ స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో పేదలకు సరుకులను అందజేశారు. ప్రతినిధులు మధుసూదనరెడ్డి, కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# డాక్టర్ సిఆర్ రెడ్డి సేవలు అభినందనీయం

### మంత్రి కాకాణి



గూడూరు పరిసర ప్రాంతాల పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందించి ప్రజా వైద్యునిగా పేరుగడించిన గొప్ప వ్యక్తి డాక్టర్ సి.ఆర్.రెడ్డి అని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇటీవల గూడూరు పట్టణంలోని డాక్టర్ సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించిన సి.ఆర్.రెడ్డి సంతాపసభలో వారు పాల్గొని ప్రసంగిస్తూ డాక్టర్ సి.ఆర్.రెడ్డి అనేక ఏళ్లుగా వైద్యవృత్తిలో ఉంటూ పేదప్రజలకు విశేష సేవలు అందించారన్నారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, మాజీమంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మెల్యే ఉపేంద్రరెడ్డి, పలు సంఘాల నాయకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# నేదురుమల్లిని కలిసిన బత్తిని



గూడూరు వైసీపీ సీనియర్ నాయకులు బత్తిని విజయకుమార్ ఈ నెల 8వ తేదీ తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని వాకాడులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువా కప్పి, సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారు గూడూరు నియోజకవర్గంలోని పలు విషయాలుపై చర్చించారు. గూడూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి త్వరలో పర్యటిస్తారని తెలిపారు.

# పదిలో సత్తా చాటిన ఎల్ఏపి




ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో గూడూరు, శారదానగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు అందరూ నూటికి నూరు శాతం ఫలితాలు సాధించడంతో కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ సుధేష్ణరెడ్డి విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. పరీక్షల్లో 600 మార్కులకు గాను 563 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన పి.శశికాంత్ అనే విద్యార్థిని ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలతో అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# వేసవి క్రికెట్ శిక్షణా శిబిరం

గూడూరు క్రికెట్ క్లబ్, అల్లూరు ఆదిశేషారెడ్డి, హరిచంద్రారెడ్డి క్రికెట్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏసిఏ సబ్ సెంటర్ నందు ఇటీవల వేసవి క్రికెట్ శిక్షణా శిబిరాన్ని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు ప్రారంభించారు. డా. సి.జనార్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ వేసవిలో ఏదో ఒక క్రీడలో శిక్షణ తీసుకోవడం యువక్రీడాకారులకి మంచిదని, ఈ స్టేడియం ఎప్పుడూ ఏదో ఒక క్రీడతో కళకళలాడుతూ వుండాలని ఆదిశేషారెడ్డి కోరుకునేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసరెడ్డి, కొణిదల మునిగిరీష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# టెన్త్‌లో వివిఎస్సార్ విజయదుందుభి

పదవ తరగతి ఫలితాలలో గూడూరు రెండవ పట్టణ పరిధిలోని వివిఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణరాజు మాట్లాడుతూ, పాఠశాలలో 51 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారని, 26 మందికి 500కుపైగా, ఏడు మంది విద్యార్థులకు 570 పైగా మార్కులు వచ్చాయని, ఇంతటి ఘన విజయం సాధించిన పాఠశాల విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి అధ్యాపకేతర బృందానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రధానోపాధ్యాయులు శాంతకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణులకు అండగా ఉంటాం



తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే విశ్వబ్రాహ్మణులకు అండగా ఉండి, సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని కుమ్మరవీధిలో విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మయ్య ఆచారి, వెంకట శేషయ్యఆచారి, గురుబ్రహ్మాచారి, ఆదినారాయణాచారి, రవికుమార్ ఆచారి, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణీకులకు మరుగుదొడ్లు

గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ప్రయాణీకులకు, పేదల సౌకర్యార్థం మరుగుదొడ్లను నిర్మించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ అక్కడ ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ఆర్డీవో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.





# నిస్వార్థ నాయకుడు.. కాకాణి రమణారెడ్డి

జిల్లాలో పేరొందిన నేత, పొదలకూరుకు చెందిన నాయకుడు, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి కాకాణి రమణారెడ్డి నిస్వార్థ నాయకుడని తిరుపతి ఎంపీ గురుమూర్తి కొనియాడారు. కాకాణి కుటుంబంతో తమకున్న అనుబంధాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఉంటూ, నైతికవిలువలు పాటిస్తూ రమణారెడ్డి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని, నేటి తరం రాజకీయనాయకులకు రమణారెడ్డి స్ఫూర్తిప్రదాత అని అన్నారు. ఈనెల 7న పొదలకూరు మండలం తోడేరులో రమణారెడ్డి ద్వితీయ వర్ధంతి జరిగింది. మంత్రి కాకాణితో పాటు, జిల్లా వ్యాప్తంగా అనేకమంది నాయకులు, ప్రముఖులు తరలివచ్చి ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, డిసిసిబి మాజీ ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్షల్లో.. 9వ స్థానం

## • సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు

ఇటీవల వచ్చిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లాకు మంచి ఉత్తీర్ణతే లభించింది. రాష్ట్రంలో నెల్లూరుజిల్లా 9వ స్థానం సాధించింది. ఉత్తీర్ణత శాతం 75.61 వచ్చింది. 11 పాఠశాలలు నూటికి నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం విశేషం. జిల్లావ్యాప్తంగా 27256 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలు రాయగా, 20466 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫెయిలైన 6790 మందిలో ఎక్కువ మంది లెక్కల్లో తప్పారు. ఒక్క గణితంలోనే అంతపెద్ద సంఖ్యలో విద్యార్థులు ఫెయిల్ కావడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మునిసిపల్ స్కూల్ విద్యార్థులు, జడ్పీ విద్యార్థులు, ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుకునేవారు అత్యధికశాతం మంది పాసయ్యారు. నెల్లూరులోని కెవిఎస్ఆర్ మునిసిపల్ స్కూల్‌లో గోకుల కృష్ణారెడ్డి అనే విద్యార్థి 593 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచాడు. లింగసముద్రం మండలంలోని పెదపవనిలో ఉన్న బాలయోగి గురుకుల బాలికల పాఠశాలలో 80 మంది పరీక్షలు రాస్తే, 79 మంది ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులు కావడం విశేషం. ఫెయిలైన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

# కలవకొండ నరసింహస్వామి కళ్యాణం



చిల్లకూరు మండలం కలవకొండ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇటీవల స్వామి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం ఆలయ ఛైర్మెన్ కందల ఆనంద్, ఈవో నవీన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కళ్యాణం తిలకించేందుకు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ నిర్మాణ స్ఫూర్తిప్రదాత ఎరటపల్లి జానకిరామిరెడ్డి, ఎరటపల్లి చరణ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సోమశిలలో వేడుకగా గంధమహోత్సవం

అనంతసాగరం మండలంలోని సోమశిల దర్గాలో ఈనెల 7న శ్రీ హజరత్ సయ్యద్ మౌలాలి సాహెబ్ గంధమహోత్సవం వేడుకగా జరిగింది. మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టిడిపి నాయకులు పాతపాటి మధుసూదన్‌రెడ్డిని నిర్వాహకులు సత్కరించారు. నాయకులు చల్లా నరసారెడ్డి, పార్థసారథినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'జగనన్నకు చెబుదాం'ను

# సద్వినియోగం చేసుకోండి

### కలెక్టర్ హరినారాయణన్



ప్రజలు నేరుగా తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అన్నారు. ఈనెల 9న తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి వర్చువల్‌గా ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, అడిషనల్ ఎస్పీ హిమవతి, జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తూ ముఖ్యమంత్రి ప్రారంభించడం హర్షదాయకమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 1902 హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ప్రజలు ముఖ్యమంత్రికి తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ప్రత్యేక బృందాలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సత్వరమే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ,డిఆర్‌డిఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, వెంకట దాసు, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డిపిఓ సుస్మిత, జడ్పీ సీఈవో చిరంజీవి, డిఇఓ గంగాభవాని తదితర అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

## కలెక్టర్‌కు ఏపీయుడబ్ల్యుజె వినతి



జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ నెల్లూరులోని ఏపీయుడబ్ల్యుజె నాయకులు ఈనెల 9న జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ను కలసి విజ్ఞప్తి చేశారు. ఏపియుడబ్ల్యుజె నాయకులు ఏ.జయప్రకాష్, వల్లూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక ఉద్యమాలు చేసి జర్నలిస్టులు సాధించుకున్న సౌలభ్యాలను కూడా ప్రభుత్వం రద్దుచేయడం దారుణమన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కరించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలని కోరారు. రైల్వే రాయితీలను, యాక్సిడెంట్ ఇన్సురెన్స్ పాలసీలను పునరుద్ధరించాలని కోరారు. కరోనాతో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు 5 లక్షల రూపాయలను సాయంగా అందజేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు విజ్ఞాపనపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజె నాయకులు ఎస్ రామమూర్తి, సామ్నా రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయకుమార్, జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్.రామమూర్తి, కార్యదర్శి హనోక్, కోశాధికారి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌కు సంగం విద్యార్థులు



మండల కేంద్రమైన సంగంలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 8మంది అండర్-18 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 7న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన పోటీలకు జిల్లా స్థాయిలో పాల్గొని ఆ విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. అనుష్క, వైష్ణవి, అర్చిత, ప్రవల్లిక, నీలిమ, అంకితలు రాష్ట్రస్థాయి బాలికల జట్టుకు ఎంపిక కాగా, రషీద్, చరణ్‌లు రాష్ట్రస్థాయి బాలుర జట్టుకు ఎంపికయ్యారని, ఈనెల 26 నుంచి అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించి, పోటీల్లో విజయం సాధించి పాఠశాల పేరు నిలబెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

# టూకీగా...



## జొన్నవాడలో.. 20వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో ఈనెల 10న అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 20వ తేది వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు ఈనెల 8న గోడపత్రికలను ఆవిష్కరించారు. ఆలయ అధికారులు, ధర్మకర్తలమండలి వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కోవూరులో వీరాంజనేయస్వామికి.. పల్లకిసేవ

హనుమత్‌జయంతి ఉత్సవాల సందర్భంగా కోవూరులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి ఈనెల 8న పల్లకిసేవ నిర్వహించారు. పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, నాగవల్లి పత్రాలతో పూజలు చేశారు. ఆలయ అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో, పచ్చిపాల కృష్ణకిషోర్‌రెడ్డి దంపతుల ఉభయకర్తృత్వంలో ఈ వేడుకలు జరగాయి.

## సోమశిలలో.. అక్రమ మట్టి తరలింపుపై ఆందోళన

అనంతసాగరం మండలంలోని సోమశిలలో అక్రమంగా గులకరాయి, మట్టి తరలింపులపై స్థానిక హిల్‌కాలనీ మహిళలు ఈనెల ఆందోళన చేపట్టారు. రాత్రిపగలు మట్టి తరలిస్తూనే ఉన్నారని, ఇళ్ల పక్కనే వెళ్తున్న ఆ ట్రాక్టర్ల శబ్దానికి నిద్ర లేకుండా పోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమార్కులపై అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## కావలిలో..'స్పందన' అర్జీదారులకు భోజనం ప్యాకెట్లు

కావలిలో ప్రతి సోమవారం జరుగుతున్న స్పందన కార్యక్రమంలో పాల్గొంటున్న అర్జీదారులకు భోజనం ప్యాకెట్లు అందజేసేందుకు కావలి ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. కావలి రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో, దాత డాక్టర్ బెజవాడ రవికుమార్ సాయంతో ఏర్పాటైన ఈ కౌంటర్‌ను ఈనెల 8న కావలి ఆర్డీఓ శీనానాయక్ ప్రారంభించారు.

## పల్లిపాళెంలో పోలేరమ్మ అమ్మవారి విగ్రహప్రతిష్ఠ

బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు పంచాయతీలోని పల్లిపాళెంలో ఉన్న శ్రీ పోలేరమ్మ దేవాలయంలో ఈనెల 8న పోలేరమ్మ అమ్మవారి విగ్రహప్రతిష్ట చేసి పూజలు చేశారు. ఆలయ కమిటీ వారితో పాటు, వైకాపా మండల నాయకుడు చెర్లో సతీష్‌రెడ్డి, నాయకులు లక్ష్మయ్య, వినోద్, ప్రదీప్, నాగేంద్ర, భాస్కర్‌రెడ్డి, ప్రమీలమ్మ, హరి తదితరులు పాల్గొన్నారు.

## చింతగుంటలో పేకాటరాయుళ్ళ అరెస్ట్

వెంకటగిరి రూరల్ మండలం చింతగుంట గ్రామంలో పేకాటాడుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారివద్ద నుంచి 11.020 రూపాయలతో పాటు, 3సెల్‌ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జిలాని ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పాతదేవరాయపల్లిలో..అక్రమ ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతసాగరం మండలంలోని పాతదేవరాయపల్లిలో ఈనెల 7న పెన్నాతీరం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ అధికారులు పట్టుకుని వాటిని నడుపుతున్నవారికి జరిమానా విధించారు. ఆ ట్రాక్టర్లను అనంతసాగరం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

## పిడూరులో.. క్రికెట్ టోర్నమెంట్

మనుబోలు మండలంలోని పిడూరు మెట్ట వద్ద ఆర్‌టిఆర్ సోదరుల ఆధ్వర్యంలో ఈనెల 7న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. 27 జట్లు పాల్గొంటున్నాయి. రవితేజారెడ్డి ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రముఖులు ఆడిపూడి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి , నిర్వాహకులు వినయ్, శ్రీహరి పర్యవేక్షించారు.

## పేదలకు మందులు పంపిణీ

నెల్లూరులోని వికాస్ సేవాసమితి ఆధ్వర్యంలో ఈనెల 7న పేదలకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆ సమితి అధ్యక్షుడు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, పేదలకు మందులు పంపిణీ చేసే ఈ కార్యక్రమంలో సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.


# కల్యాణ వైభవం...!



గూడూరు వైసిపి సీనియర్ నాయకుడు కోడూరు మీరారెడ్డి - గూడూరు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలతల కుమార్తె **డా. యోషితా మీనాక్షి - డా. నవీన్‌రెడ్డి** ల వివాహ రిసెప్షన్ ఈ నెల 5వ తేదీ విజయవాడలో జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వదించారు.



సిండికేట్ బ్యాంక్ రిటైర్డ్ చీఫ్‌మేనేజర్ పి.శ్రీనివాసులు - లేట్ సంఘమిత్రల కుమారుడు **జ్ఞాన వర్ష - డా. హేమా మాధురి** (నెల్లూరు వాస్తవ్యులు వెంకటరమణ - పద్మారమణల కుమార్తె)ల పరిణయం మే 7వ తేదీ నెల్లూరులోని పావని గార్డెన్‌లో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభదీవెనెలు.



చేజర్ల మండలం, పుల్లనీళ్ళపల్లి వ్యాస్తవ్యులు మాగంటి ప్రసాద్‌నాయుడు - పద్మజల కుమార్తె **స్నేహ - మనోజ్‌కుమార్** (విజయవాడ వాస్తవ్యులు బొల్లినేని బాబురావు - లక్ష్మీల కుమారుడు)ల కళ్యాణం మే 10వ తేదీ నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్ నందు వైభవంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.



నెల్లూరు వాస్తవ్యులు తోటపల్లి సర్వోత్తమరావు - ఉమామహేశ్వరిల కుమారుడు **సతీష్ - భువన వైష్ణవి** (గూడూరు వాస్తవ్యులు వేములచేడు జనార్ధన్ - శైలజల కుమార్తె)ల పెళ్లి మే 10వ తేదీ నెల్లూరులో శ్రీ అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపము నందు ఘనంగా జరిగింది. నూతన జంటకు 'లాయర్' శుభాశీస్సులు.



## సంప్రదాయబద్ధంగా...

# అన్నమయ్య 614వ జయంతి

## కీర్తనలతో అలరించిన చిన్నారులు ఆకట్టుకున్న కార్యక్రమాలు

'వాగ్గేయకార వైభవం' పేరుతో శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య 614వ జయంతి, ఆ సందర్భంగా 'సద్గురు గానం అకాడమీ' ప్రారంభోత్సవం, చిన్నారుల కీర్తనలు, కూచిపూడి నృత్యాలు వంటి కార్యక్రమాలకి నెల్లూరులోని పురమందిరం వేదికయ్యింది. మే 6వ తేదీ శనివారం సాయంత్రం జరిగిన ఈ సంప్రదాయ సంబరానికి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సభ, భారతీ సంగీత విద్యాలయం, శ్రీ గురు త్యాగరాజ ఆర్ట్స్ అకాడమీ, శ్రీ రాజరాజేశ్వరి నృత్యనికేతన్ వ్యవస్థాపకులు శ్రీమతి లక్ష్మీప్రసన్న, శ్రీమతి రమాదేవి, కుమారి వైష్ణవి, వేదాంతం విదుమౌళిలు సారధ్యం వహించారు.




చెన్నైకి చెందిన సుప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు, సంగీత గురువు 'కలైమామణి' శ్రీమతి రాజేశ్వరి ప్రధాన అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఆదిశంకర విద్యా సంస్థల అధినేత వంకి పెంచలయ్య, 'లాయర్' పత్రిక సంపాదకులు శివప్రభాత్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ నిర్వాహకులు వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రపంచ తెలుగు సమాఖ్య స్థానిక సమన్వయకర్త నలుబోలు బలరామయ్యనాయుడు, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, ఆనం రాజకీయ వారసుడు రంగమయూర్‌రెడ్డి, పర్పుల్‌వ్యాలీ స్కూల్ అధినేత శ్రీనివాస్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

ఏ గురువైనా తమ శిష్యులకు తల్లి లాంటిదని, తన శిష్యురాండ్రు రమాదేవి, లక్ష్మీప్రసన్న కూడా తనకు కన్నబిడ్డల లాంటి వాళ్ళని 'కలైమామణి' రాజేశ్వరమ్మ అన్నారు. సంగీత ప్రపంచంలో ఆ ఇద్దరు చేస్తున్న సేవకి మురిసిపోయి, తాను 75 సంవత్సరాల వయస్సులో కూడా ప్రతీ వారం మద్రాసు నుండి నెల్లూరుకు రావడానికి ఒప్పుకున్నానని అన్నారు. వాళ్ళు చేస్తున్న ప్రయోగాన్ని, ప్రయత్నాన్ని ఆదరించి ఆశీర్వదించాలని ఆమె కోరారు.

ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోకుండా సంగీత సేవ చేస్తున్న కార్యక్రమ నిర్వాహకులను వంకి పెంచలయ్య అభినందించారు.

అభినవ ఎం.ఎస్.సుబ్బలక్ష్మి లాంటి రాజేశ్వరమ్మని నెల్లూరుకు రప్పించి, రేపటి తరానికి సంప్రదాయ సంగీతంలో శిక్షణ ఇప్పించాలన్న ఆలోచన చేసిన స్థానిక సంగీత గురువులను శివప్రభాత్‌రెడ్డి ప్రశంసించారు.

క్రమం తప్పకుండా ప్రతీ ఏటా అన్నమాచార్య జయంతిని నిర్వహిస్తుండడం, మన సంస్కృతీ, సాంప్రదాయాలతో పాటు వాగ్గేయకారుల పట్ల ఈ కార్యక్రమ సారధులకున్న మక్కువకు నిదర్శనంగా చెప్పుకోవచ్చని అంటూ వారికి వీరిశెట్టి హజరత్‌బాబు తన అభినందనలు తెలిపారు.

తమను అన్నివిధాలా ప్రోత్సహిస్తున్న సంగీత ప్రియులకు, తమ దగ్గర సంగీత సాధన చేస్తున్న చిన్నారులకు వారి అమ్మానాన్నలకు రమాదేవి, లక్ష్మీప్రసన్నలు ధన్యవాదాలు తెలిపారు. సమున్నత ఆశయంతో తాము కొత్తగా స్థాపించిన 'సద్గురు గానం అకాడమీ(స్కూల్ ఆఫ్ ఆర్ట్)'ని కూడా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

చిన్నారుల సంకీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ప్రతిభావంతులకు ప్రశంసలు వంటి కార్యక్రమాలతో ఈ 'వాగ్గేయకార వైభవం' జరిగింది. 'కళాంజలి' అనంత్, దువ్వూరు బెనర్జీలు కార్యక్రమ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.

# భానుప్రకాష్‌ను అభినందించిన కమిషనర్



నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డు ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్‌లో పనిచేస్తున్న భానుప్రకాష్ ఇటీవల తిరుపతిలో నిర్వహించిన సిఎం కప్ హాకీ పోటీలో విజయం సాధించడంతో, ఆయనను కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ అభినందించారు. కార్పొరేషన్‌లో పనిచేస్తున్న భానుప్రకాష్ హాకీలో ఉత్తమ ప్రతిభతో రాణించి కప్‌ను కైవశం చేసుకోవడం సంతోషకరమని ప్రశంసించారు. ఈ సందర్భంగా భానుప్రకాష్‌ను కార్పొరేషన్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కూడా అభినందించి, భవిష్యత్‌లో మరిన్ని కప్పులు గెలవాలని ఆకాంక్షించారు.

## వీరారెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించిన ఆనం



ఇటీవల అకాల మరణం చెందిన మర్రిపాడు మండల ప్రముఖులు, డిసిపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ గోపిరెడ్డి వీరారెడ్డి కుటుంబాన్ని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అదేవిధంగా, ఈనెల 8న మర్రిపాడు మండలం డిసి పల్లి నరజాల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను ఆనం రామనారాయణరెడ్డి పరామర్శించారు. ఆనం వెంట మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి, పిఏసిఎస్ అధ్యక్షులు చెన్నారెడ్డి,మర్రిపాడు నారాయణ నాయుడు తదితర ప్రముఖులు ఉన్నారు.

## గొలగమూడిలో రాష్ట్రస్థాయి శిక్షణా కార్యక్రమం

వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమ ఉన్నత పాఠశాల నందు మూడు రోజులు రాష్ట్రస్థాయి గణితశాస్త్ర రిసోర్స్‌పర్సన్‌ల ఇండక్షన్ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైనట్లు కోర్సు సమన్వయ కర్త మరియు ప్రభుత్వ డైట్, పల్లిపాడు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలియజేశారు.ఈ శిక్షణా కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా జిల్లా విద్యాశాఖాధికారిణి శ్రీమతి ఆర్.యస్.గంగా భవాని వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మరియు పిఎస్ఇఆర్‌టి–అమరావతి సంయుక్తంగా ఈ శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి 53 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారని తెలిపారు. 10వతేదీ వరకు ఈ శిక్షణ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించబడుతుందని,శిక్షణ అనంతరం రిసోర్స్ పర్సన్లు వారి వారి జిల్లాల్లో ఈ నెల 15 నుండి 19 వరకు అనగా 5 రోజుల పాటు జరిగే జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంలో శిక్షకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి పరిశీలకులుగా ఏపి ఎస్ఇఆర్‌టి సహాయ ఆచార్యులు కే.శ్రీనివాస్, సమగ్ర శిక్ష–నెల్లూరు ఎ.యమ్.ఓ జి.సుధీర్‌బాబు, సీనియర్ డైట్ అధ్యాపకులు డాక్టర్ ఆర్.బాలాజీరావు, డైట్ ఉపన్యాసకులు యస్.బోయదాస్, కె.విజయచంద్ర, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్ మదన్‌కుమార్, శిక్షకులు జి.లీలామోహన్, యల్.హిమగిరి, కె.వి రమణమూర్తి, కె.మల్లేశ్వరరావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అవినాష్‌కు ఈసారి టికెట్...!?



వివేకా మర్డర్ కేసులో అసలు కిల్లర్స్ ఎవరు అనేది ఇప్పటికిప్పుడు తేలే అవకాశం లేకపోయినప్పటికీ వై.ఎస్.భాస్కరరెడ్డి కుటుంబం మాత్రం బాగా అల్లరైపోయింది అనేది నిర్వివాదాంశం.

ఆయన కుమారుడే వై.ఎస్.అవినాష్‌రెడ్డి. వీరు అటు జగన్‌కు, ఇటు ఆయన సతీమణి భారతికి కూడా దగ్గరి బంధువులు.

ఇంత అల్లరి చోటు చేసుకున్న తరువాత, అవినాష్‌రెడ్డికి కడప ఎం.పీ టికెట్‌ను వైసీపీ కేటాయిస్తుందా అనే విషయమై పార్టీలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఆయనకు టికెట్ ఇస్తే, తెలుగుదేశం పార్టీకి వైసీపీ చేసే మేలు ఇంతకంటే మరోటి ఉండదనే వ్యాఖ్యానాలు పార్టీ వర్గాల నుంచి వినబడుతున్నాయి. టికెట్ ఇవ్వకపోతే, వై.ఎస్.అవినాష్‌పై వచ్చిన ఆరోపణలను పరోక్షంగానైనా ఆమోదించినట్టు అవుతుంది కదా అని భయపడేవారు కూడా ఉన్నారు.

దీంతో, ఆయనకు టికెట్ కేటాయిస్తే ఒక సమస్య, కేటాయించకపోతే ఒక సమస్యగా వైసీపీకి పరిణమించవచ్చునని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, కడప పార్లమెంట్ స్థానం నుంచి వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డి పోటీ ఖాయం అని అంటున్నారు. అయితే, టీడీపీ సమర్థిత ఇండిపెండెంట్‌గానా, లేక... నేరుగా టీడీపీ అభ్యర్థిగానా అనే విషయంలో స్పష్టత లేదు.

అయితే, కడప లోక్‌సభ స్థానం నుంచి డాక్టర్ సునీతారెడ్డిని ఎదుర్కొనాల్సి ఉంటుందనే స్పృహతో, వైసీపీ అభ్యర్థిని నిర్ణయించాల్సి ఉంటుందని వైసీపీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

గత ఎన్నికల్లో.... వివేకానందరెడ్డి మర్డర్ ఘటన గణనీయమైన పాత్ర పోషించినట్టే... రానున్న ఎన్నికల్లోనూ అది గణనీయమైన పాత్ర పోషించడం ఖాయం లాగే కనిపిస్తోంది.

నిజానికి, డాక్టర్ వై.ఎస్. పరివారంపై రెండు, మూడు రకాల కేసులు కనపడుతున్నాయి. 1. జగన్‌పై అక్రమాస్తుల కేసులు. 2. ఇప్పుడు వై.ఎస్. వివేకానందరెడ్డి హత్య కేసు. 3. కోడి కత్తి కేసు.

మొదటి దానిలో విచారణ ఎంత ఆలస్యం అయితే... జగన్‌కు అంత 'రాజకీయ ప్రయోజనం' ఉంది. జనం కూడా ఆ విషయం ఇప్పటికే మరిచిపోయారు. నీతి – అవినీతి అనేది ఇప్పుడు రాజకీయాలలో ఓ ముఖ్యమైన అంశమే కాకపోవడమే ఇందుకు కారణం. కాకపోతే, ఎవరు ఎంత ఎక్కువ లూటీ చేశారు.... ఎవరికి ఎంత స్థాయిలో అవకాశం దొరికింది అనేది జనం సరదాగా మాట్లాడుకోడానికి మాత్రమే పనికివచ్చే సబ్జెక్టుగా మారిపోయింది. అందువల్ల జగన్‌పై గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సీబీఐ, ఈడీ కేసులు మరో ఇరవై ఏళ్ళు పెండింగ్‌లో ఉన్నా, జగన్‌కు గానీ, సీబీఐకి గానీ, న్యాయవ్యవస్థకు గానీ వచ్చే ఇబ్బంది ఏమీ లేదనే చెప్పవచ్చు.

దీనివల్ల, దేశంలో సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలు, న్యాయవ్యవస్థ, న్యాయవాద వ్యవస్థ మొదలైన వాటి పనితీరుపై మంచి మెరుగైన అనుభవం ఆయనకు వచ్చింది. ఆయన రాజకీయ ప్రయాణం నిరాఘాటంగా, సాఫీగా సాగడానికి ఈ అనుభవం బాగా ఉపకరిస్తుంది కూడా.

ఇక, రెండవది వై.ఎస్.వివేకానందరెడ్డి మర్డర్ కేసు.


ఇందులో కడప ఎం.పీ వై.ఎస్.అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి పేరు బాగా ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చాయి. ఈ ఘటనకు సంబంధించి ఇప్పుడు అరెస్ట్ అయ్యి జైలులో ఉన్నవారు అందరూ వై.ఎస్.భాస్కరరెడ్డికి సన్నిహితులే అనే విషయం కూడా రహస్యం ఏమీ కాదు.

జగన్‌కు చిన్నాన్న అయిన వై.ఎస్.భాస్కరరెడ్డి ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉన్నారు. అవినాష్‌రెడ్డిని కూడా అరెస్ట్ చేయక తప్పదు అని తెలంగాణ హైకోర్టులోనే చెప్పిన సీబీఐ, ఆ పని మాత్రం చేయడం లేదు. అది 'వ్యూహాత్మకం' కూడా కావచ్చు. ఆ విషయం... బయట వ్యాఖ్యానాలు చేసేవారికి తెలియకపోవచ్చు. సీబీఐ 'నిదానం' వల్ల అవినాష్‌రెడ్డికి భౌతికంగా ఉపశమనం కలుగుతోంది.

అయితే, ఇంతకుమించిన 'రాజకీయ ప్రమాదం' వైసీపీకి ఎదురు కావచ్చు. ఆ 'ప్రమాదం' రాజకీయాలను ప్రభావితం చేయవచ్చు.

ఆ 'ప్రభావం' పేరే.... 'పబ్లిక్ పెర్సెప్షన్'. రాజకీయపార్టీలు, వాటి నేతల మాటలు, చేతలపై జనబాహుళ్యానికి కలిగే అభిప్రాయమే... 'పబ్లిక్ పెర్సెప్షన్'. ఇది ఒకరు.... ఒకరికి చెప్పాల్సిన పని లేదు. ఓటర్లలో ఎవరికివారికి పార్టీలు, నేతల వ్యవహారశైలిపై కలిగే అభిప్రాయం ఇది. నేతలు ఎంతగా 'ఆత్మ స్తుతి... పరనింద'కు పాల్పడినా... జనం ఈ చెవితో విని, ఆ చెవితో వదిలేస్తారు. ఇది అల్టిమేట్. తిరుగులేనిది. ఈ పబ్లిక్ పెర్సెప్షన్ అనేది ఓటింగ్‌ను కూడా ప్రభావితం చేస్తుంది. ఈసారి అసెంబ్లీ / లోక్‌సభ ఎన్నికల్లో పబ్లిక్ పెర్సెప్షన్‌ను ప్రభావితంచేసే అంశాల్లో వివేకానంద మర్డర్ కూడా చేరిపోయిందనే మాట గట్టిగానే వినపడుతోంది.

ఎన్నికలు... షెడ్యూల్ ప్రకారం అయితే దాదాపు మరో 11నెలలు ఉన్నాయి. అందువల్ల, ఈ కేసు దర్యాప్తును ఎంత కాలం సాగదీస్తే, వైసీపీకి అంత నష్టం అని విశ్లేషకులు అంటున్నారు. దీని గురించే జనం మాట్లాడుకుంటూ ఉంటారు. అలా మాట్లాడుకుంటూ ఉండగానే.... ఎన్నికలు వచ్చేస్తాయి.




మీడియా, ప్రతిపక్షాలు, (యాంటీ) సోషల్ మీడియా, సీపీఐ రామకృష్ణ, సీపీఐ నారాయణ అన్న, రఘు రామకృష్ణంరాజు విరుచుకుపడి పోతారు. ఇవి క్షణాలలో జనానికి చేరిపోతాయి. చెవులకు విన సొంపుగా కూడా ఉంటాయి. తటస్థ ఓటర్లను బాగా ప్రభావితం చేస్తాయి.

కిందటిసారి జరిగిన ఎన్నికల్లో వైసీపీకి టీడీపీకి మధ్యలో పది శాతం ఓట్ల తేడా ఉంది. వైసీపీకి 50శాతం వరకూ వస్తే, టీడీపీకి 40శాతం వరకూ ఓట్లు వచ్చాయి. ఇందుకు అనేక కారణాలు లేకపోలేదు.

- ఫ్రిజ్‌లో నుంచి అప్పుడే బయటకు తీసిన ఐస్‌క్రీమ్ లాగా జగన్ ఇమేజ్ ఫ్రెష్‌గా ఉంది.
- రాష్ట్ర పరిపాలనకు సంబంధించి, సకల సద్గుణాభి రాముడులాగా ఆయన జనానికి కనిపించారు.
- చంద్రబాబు రోజువారీ నీతివాక్యాలతోపాటు, నిష్క్రియా పరత్వాన్ని జనం తట్టుకోలేకపోయారు.
- 2014లో గెలుపు కోసం అని ఒక్క ఎన్నికల హామీ కూడా ఇవ్వని జగన్, 2019 ఎన్నికలకని.... హామీల వర్షంలో జనాన్ని ముంచెత్తారు....
- 2014లో తెలుగుదేశంకు మద్దతుగా తిరిగిన పవన్ కళ్యాణ్, బీజేపీ... 2019లో టీడీపీని వదిలేశాయి.

ఇలా అనేక కారణాల వల్ల, వైసీపీకి టీడీపీపై దాదాపు పది శాతం ఓట్ల ఆధిక్యత లభించింది.

ఇప్పుడు పరిస్థితి ఏమిటి?

- 2019లో ఉన్నట్టుగానే, ఇప్పుడు కూడా జగన్ ఇమేజ్ జనంలో ఉందా?
- 2019లో టీడీపీకి ఓటు వేసిన వారిలో (చనిపోయినవారు చనిపోగా) ఏ వర్గం వారు అయినా టీడీపీకు దూరం అయ్యారా?
- చంద్రబాబుపై అసహనంతో, కక్షతో, కోపంతో, కసితో వైసీపీకి ఓటు వేసిన కాపులు ఈసారి వైసీపీకి వేస్తారా?
- వైసీపీ వ్యతిరేక ఓటును చీలనివ్వను అంటూ వివిధ సందర్భాలలో భీషణ ప్రతిజ్ఞ వంటిది చేస్తున్న పవన్ కళ్యాణ్‌కు.... టీడీపీతో కలిసి పోటీచేయడం ఒక రాజకీయ అనివార్యత(ఆయన రాజకీయాలలో కొనసాగాలి అనుకుంటే...) అనే విషయం వైసీపీ గమనించిందా?

ఇవన్నీ వైసీపీకి ప్రతికూల అంశాలు అని విశ్లేషకులు భావిస్తున్న తరుణంలో... వివేకానందరెడ్డి మర్డర్ కేసు వచ్చి పడింది. దీనికి ముగింపు ఇప్పట్లో కనపడడం లేదు.

రోజుకో కొత్త విషయం పబ్లిక్ డొమైన్‌లోకి వస్తోంది. సీబీఐ విచారించాల్సిన వారి జాబితాలో కొత్త కొత్త పేర్లు చేరుతున్నాయి. వీటికి సంబంధించిన కొత్త కొత్త కథనాలు ఫ్రెష్‌గా వెలుగు చూస్తున్నాయి.

ఈ కేసులో ప్రభుత్వం వేసిన రెండు సిట్‌లు (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లు) చేసిన దర్యాప్తును సీబీఐ ఎందుకు పరిగణనలోకి తీసుకోవడం లేదు అని అవినాష్‌రెడ్డి కూడా ప్రశ్నించారు. అవును. నిజమే.

రెండు సిట్‌లకు నేతృత్వం వహించిన అభిషేక్ మహంతిని సీబీఐ విచారించలేదు. అమిత్ గార్గ్‌ను ప్రశ్నించలేదు. 'వివేకా మర్డర్ కేసు గురించి కొంత నాకు తెలుసు' అని మీడియా మీట్‌లోనే చెప్పిన అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏ.బీ. వెంకటేశ్వరరావును ప్రశ్నించలేదు.

అయితే, ఈ సీబీఐ 'ఇన్వెస్టిగేషన్' అనేది ఎన్నికల వరకు ఆగడం కష్టం కావచ్చు. ఏదో ఒకటి సీబీఐ తేల్చడం సంభవం.

అవినాష్‌రెడ్డి, వై.ఎస్.భాస్కరరెడ్డికి వివేకా మర్డర్‌తో సంబంధం ఉందనో.. లేదనో చెప్పాల్సి ఉంటుంది. ఏది చెప్పినా, దాని ప్రభావం ఎన్నికల సరళిపై ఉంటుందనడంలో సందేహం లేదు.

ఇక, కోడి కత్తి కేసుతో పబ్లిక్‌కు సంబంధం లేదు. జగన్‌ను బాగా అల్లరి చేయడానికి పనికి వస్తుంది. ఎంత అల్లరి చేయగలుగుతుంది అనేది చూడాలి.

ఇన్ని 'ప్రతికూలత'ల నేపథ్యంలో కడప ఎం.పీ పదవికి పార్టీ టికెట్‌ను జగన్మోహన్‌రెడ్డి ఎవరికి ఇస్తారు అనేది రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించే విషయమే.

వై.ఎస్.అవినాష్‌రెడ్డికి ఇస్తే, రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతుంది. ఆయనపై వచ్చిన ఆరోపణల నుంచి విముక్తి కాకుండానే టికెట్ ఇచ్చారనే చర్చ ఓటర్ మైండ్‌పై ఎంతోకొంత ప్రభావం చూపుతుంది. ఒకవేళ టికెట్ ఇవ్వకపోతే, ఎందుకు ఇవ్వలేదో వివరించాల్సి ఉంటుంది.

మొత్తం మీద... జగనే 'దుష్ట చతుష్టయం' అని తరచుగా పేర్కొనే చంద్రబాబు నాయుడు, ఆంధ్రజ్యోతి / ఏబీఎన్, టీవీ 5, ఈటీవీ / ఈనాడు / దత్త పుత్రుడు అని జగన్ అభివర్ణించే పవన్ కళ్యాణ్‌ను తట్టుకోడానికి వైసీపీ పార్టీ క్షేత్రస్థాయిలో ఏమిచేస్తుందో అర్థం కావడంలేదు. బహుశా ఆ కోణంలో ఆలోచించే 'జగనన్నే మా నమ్మకం', 'జగనన్నే మా భవిష్యత్', 'జగనన్నకు చెబుదాం'.... వంటి ప్రచార కార్యక్రమాలకు వైసీపీ తెర దీసినట్టుంది.

కానీ, ఇవి 2019 నాటి నినాదాలు కదా!

**– భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

## శ్రీసిటీ సలహాదారుగా..
# జపాన్ మాజీ రాయబారి




శ్రీసిటీ సలహాదారుగా జమైకాలోని జపాన్ మాజీ రాయబారి మసనోరి నకనో నియమితులయ్యారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మసనోరి నకనో ఇటీవల జపాన్‌లో ఆమేరకు నియామక ఒప్పందంపై సంతకం చేశారు. అనంతరం మసనోరి నకనో స్పందిస్తూ, 2011లో మొదటిసారి శ్రీసిటీని సందర్శించినప్పుడు, అక్కడ అద్భుతమైన వ్యాపార సామర్థ్యం తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. శ్రీసిటీ బృందంలో చేరడం గౌరవంగా భావిస్తున్నానన్న ఆయన, జపాన్ మరియు దక్షిణ భారతదేశం మధ్య వ్యాపార భాగస్వామ్యం పెంపొందించడం కోసం పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. జపాన్ మాజీ రాయబారి మసనోరి నకనో శ్రీసిటీకి సలహాదారుగా మాతో ఉండడం గౌరవంగా భావిస్తున్నాను అంటూ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వ్యాఖ్యానించారు. శ్రీసిటీ గురించి మరింత తెలుసుకోవాలనే ఆయన ఆసక్తి ఎంతో ప్రోత్సాహకరంగా ఉందన్నారు. నకానో శ్రీసిటీలో భాగమైనందున, మరిన్ని జపనీస్ సంస్థలు ఇక్కడకు తరలివస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మసనోరి నకనో ఫిబ్రవరి 2015 నుంచి అక్టోబర్ 2017 వరకు జమైకా, కామన్వెల్త్ ఆఫ్ ది బహామాస్, బెలిజ్‌కు జపాన్ రాయబారిగా పనిచేశారని, ఫిబ్రవరి 2011 నుంచి ఫిబ్రవరి 2015 వరకు చెన్నైలో జపాన్ కాన్సుల్ జనరల్‌గా కొనసాగారని, దౌత్య విధుల్లో భాగంగా శ్రీలంక, అమెరికా, ఈజిప్ట్‌లో రాజకీయ, ప్రజా సంబంధాలు మరియు సాంస్కృతిక అధికారిగా పనిచేశారని ఆయన పేర్కొన్నారు. టోక్యో వాసెడా విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ, టోక్యో అయోమగాకున్ విశ్వవిద్యాలయం నుండి అంతర్జాతీయ రాజకీయాలలో మాస్టర్స్ డిగ్రీని పొందిన మసనోరి నకనో శ్రీసిటీకి సేవలందించడం తమకెంతో గర్వకారణమన్నారు.

## 1898 కోట్ల టర్నోవర్.. 16.45 కోట్ల ఆదాయం
# లాభాల బాటలో.. డిసిసిబి
### - ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వెల్లడి



నెల్లూరులోని జిల్లాకేంద్ర సహకార బ్యాంక్ (డిసిసిబి) లాభాల బాటలో పయనిస్తోంది. ఈ ఏడాది మార్చి 31వ తేదికి 1898 కోట్ల టర్నోవర్‌తో, 16.45 కోట్ల రూపాయల నికర ఆదాయంతో రాణిస్తోంది. బ్యాంక్ ఛైర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఇటీవల స్థానిక గాంధీబొమ్మ కూడలి వద్ద ఉన్న ఆ బ్యాంక్ కార్యాలయంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. గత ఏడాది 1524 కోట్ల టర్నోవర్ నుంచి ఈ ఏడాది 1898 కోట్లకు పెరగడం, అదేవిధంగా నికర ఆదాయం కూడా పెరగడం సంతోషకరమన్నారు. డిసిసిబి రైతుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారికి వెసులుబాటులో ఉండేవిధంగా రుణాలు ఇస్తోందని, ఒక్కోరైతుకు వారి పంటపొలాలకు సంబంధించి 20 లక్షల రూపాయల దాకా రుణాలు అందజేస్తున్నామని ఆయన చెప్పారు. ఇప్పటిదాకా దాదాపు 650 కోట్ల రూపాయలను రైతులకు రుణాలుగా ఇచ్చామన్నారు. బ్యాంక్ అధికారులు, సిబ్బంది సహకారంతో 92 శాతం రుణాలను రికవరీ చేశామన్నారు. బ్యాంకు డిపాజిట్లు కూడా 380 నుంచి 450 కోట్లకు చేరుకున్నాయన్నారు. రైతుల అభ్యున్నతే ప్రాధాన్యతగా బ్యాంకు తన కార్యకలాపాలు సాగిస్తోందని చెప్పారు. రైతులు రుణాలు సక్రమంగా చెల్లించి, తక్కువ వడ్డీతో మరిన్ని రుణాలు పొందే సౌలభ్యం తమ బ్యాంక్ కల్పిస్తోందన్నారు. ఈ బ్యాంక్ అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన ఆర్థిక సహకారం ఎంతో గొప్పదన్నారు. స్వయం సహాయ సంఘాలకు, మత్స్యకారులకు బ్యాంక్ ద్వారా విరివిగా రుణాలిస్తున్నామని తెలిపారు.

### త్వరలోనే మరో 5 శాఖలు :

జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు సంబంధించి ఉమ్మడి నెల్లూరుజిల్లాలో ప్రస్తుతం 20 శాఖలు ఉన్నాయని, మరో 5 శాఖలను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని బ్యాంక్ ఛైర్మెన్ సత్యనారాయణరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఆ మేరకు రిజర్వుబ్యాంకు అనుమతి మంజూరు చేసిందని, కలువాయి, ఏఎస్‌పేట, ముత్తుకూరు, బిట్రగుంట, జలదంకిలలో ఈ శాఖలను ఏర్పాటుచేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా రైతులకు అందుబాటులో ఉండేందుకు బ్యాంకును మరింతగా అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు ఎన్‌వి రమణయ్య, దక్కిలి రమణయ్య, డిసిఓ సుధాభారతి, సిఇఓ శంకర్‌బాబు, నాబార్డ్ డిడిఎం రవిసింగ్, ఆప్కాబ్ జిఎం శ్రీనివాసులు, డిజిఎం ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూరుకి ఆయన వచ్చిన వేళ
# ఓ అభిమాని ఆనందహేల



### పార్టీకి సేవకుడు - వెంకయ్యకి విధేయుడు... కుడుముల సుధాకరుడు

**తాను ఏ పదవిలో వున్నా, ఏ హోదాలో వున్నా తనకిష్టమైన వాళ్లకి అందుబాటులో ఉండడం, 'తన' అనుకున్నవాళ్ళతో సహజమైన నెల్లూరు యాసలో మాట్లాడడం భారత 13వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి అలవాటు. చిన్నప్పుడు తాను పెరిగిన ఊరన్నా, తాను రాజకీయాలలోకి వచ్చినప్పటినుండి జిల్లాలో తాను తిరిగిన ప్రాంతాలన్నా, తాను కలుసుకున్న మనుషులన్నా, తనని అభిమానించే అనుచరులన్నా ఆయనకి ఎనలేని మక్కువ. పరిచయస్తులు ఎదురైతే పేరుపెట్టి పిలిచి బాగున్నావా..? అని పలకరించడం ఆయన నైజం.**

ఇదే ఆనవాయితీని ఆయన ఇటీవల తన ఆత్మకూరు పర్యటనలో కొనసాగించారు. ఆత్మకూరు పెద్దాయన స్వర్గీయ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి విగ్రహ ఆవిష్కరణకి రమ్మని బొమ్మిరెడ్డి కుటుంబసభ్యులు వెంకయ్యని ఆహ్వానిస్తే... ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఒప్పుకున్నారు. తనపై పోటీచేసి తనను ఓడించిన నాయకుడి విగ్రహావిష్కరణకి వస్తానని మాటిచ్చి 66 కిలోమీటర్లు రోడ్డు మార్గాన ప్రయాణం చేసి వెళ్లడమే వెంకయ్యలోని విలక్షణ తత్వానికి ప్రతీక.

### సంబరపడిన అభిమానులు

ఆయన కేవలం అక్కడితో ఆగలేదు. ఒక గంటో రెండు గంటలో జరిగే ఆవిష్కరణ కార్యక్రమానికి పరిమితం కాలేదు. ఆత్మకూరుతో ఆయనకి నాలుగు దశాబ్దాల అనుబంధం ఉంది. అక్కడ ఆయనకి వందలమంది అభిమాన గణం ఉన్నారు. వాళ్ళందరిని ఒక్కసారి కలుసుకోవాలనుకున్నారు. స్థానికంగా ఉన్న ఒక కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉదయం నుండీ సాయంత్రం వరకూ ఆత్మకూరులోనే ఉన్నారు.

### ఉబ్బితబ్బిబైపోయిన అభిమాని...

భారత 13వ ఉపరాష్ట్రపతి హోదాలో ఆయన ప్రభుత్వ అతిథిగృహంలో బస చేయలేదు. తనను ఆహ్వానించిన బొమ్మిరెడ్డి కుటుంబం ఏర్పాటు చేసిన విడిదికి వెళ్ళలేదు. సుదీర్ఘ కాలంగా తనను అభిమానిస్తూ తన వెంటే నడుస్తున్న తన అభిమాని



ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి ఆత్మకూరుకు వచ్చిన అటల్ బిహారీ వాజపేయి సభలో ప్రసంగిస్తున్న సుధాకరరెడ్డి. చిత్రంలో వెంకయ్య నాయుడు కూడా వున్నారు.



వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న కుడుముల సుధాకర్

కుడుముల సుధాకరరెడ్డి ఇంటికి వెళ్లారు. దాదాపు ఆరు గంటల సమయం సుధాకరరెడ్డి నివాసంలోనే గడిపారు. అక్కడే మధ్యాహ్నం భోజనం చేశారు. సుధాకరరెడ్డి కుటుంబసభ్యులతో కాలక్షేపం చేశారు. అక్కడే విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం తయారై విగ్రహావిష్కరణకు వెళ్ళి, రాత్రికి తిరిగి వెంకటాచలం చేరుకున్నారు.

తమ గురువు, దైవం, నాయకుడు తమ ఇంటికి వస్తున్నానని ఆయనే స్వయంగా ఫోన్‌చేసి చెప్పడం, చెప్పినట్లుగా వచ్చి 6 గంటలు తమ నివాసంలో గడపడం తన జీవితంలో మరువలేని మధుర క్షణాలని మురిసిపోతున్నాడు సుధాకరరెడ్డి.

1985 వెంకయ్య ఆత్మకూరునుండి పోటీ చేసినప్పటినుండి సుధాకరరెడ్డి వెంకయ్య వెంటే నడుస్తున్నారు. భాజపా యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా, ఒకసారి జిల్లా పార్టీ కార్యదర్శిగా, 3సార్లు పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిగా, ఒకసారి రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సభ్యుడిగా పార్టీకి సేవలందించాడు సుధాకరరెడ్డి. 2011లో ఆనాటి తెలుగుదేశం పాలనలో ఆత్మకూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్‌గా సుధాకరరెడ్డిని నియమించడం అప్పట్లో పెను సంచలనం. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భాజపా నాయకుడికి టీడీపీ ప్రభుత్వంలో నామినేటేడ్ పదవి కట్టబెట్టడం వెనుక వెంకయ్య వ్యక్తిగత చొరవ ప్రయత్నమే కారణమని గర్వంగా చెప్పుకుంటాడు సుధాకరరెడ్డి. పార్టీకి సేవకుడిగా, తమ నాయకుడికి విధేయుడిగా 4 దశాబ్దాలుగా ప్రజా జీవితంలో ఉన్న తనపై తమ పెద్దాయన చూపించిన ప్రేమ, వాత్సల్యం ఎన్నటికీ మరువలేనంటున్నాడు సుధాకరరెడ్డి. తమ ఇంటికి వెంకయ్య వస్తుంటే సాక్షాత్తూ ఆ దైవమే నడిచి వస్తున్నాడన్నట్లుగా భావించానని మురిసిపోతున్నాడాయన. నలభైఏళ్లుగా అంకితభావంతో, ఆత్మవిశ్వాసంతో, పార్టీకి సేవకుడిగా, వెంకయ్యకి విధేయుడిగా పనిచేస్తున్న తన ఇంటిలో వెంకయ్య విడిది చేయడంతో తన జన్మ ధన్యమయ్యిందని ఉబ్బితబ్బిబైపోతున్నాడు సుధాకరరెడ్డి.

## వేదగిరిపై నిత్యాన్నదానానికి..
# 50వేల విరాళం

నెల్లూరు రూరల్‌లోని వేదగిరిపై వెలసివున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కి చెందిన శ్రీరక్ష కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ వారు ఈనెల 10న 50 వేల రూపాయలు విరాళమిచ్చారు. ఆలయ ఛైర్మెన్ సురేంద్రరెడ్డి, ఇ.ఓ గిరికృష్ణలకు కంపెనీ ప్రతినిధులు ఆ మొత్తాన్ని అందజేశారు. దాతలను ఆలయ నిర్వాహకులు సత్కరించారు.

## సీనియర్లకు ప్రమోషన్లు

నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు ప్రవీణ్, చెంచయ్యలకు సూపరింటెండెంట్‌లుగా ప్రమోషన్ ఇస్తూ కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఈనెల 10న వారికి నియామక పత్రాలు అందజేశారు.

# వైకాపా పాలన.. అంతా అరాచకం
### బిజెపి నేతల విమర్శ




రాష్ట్రంలో వైకాపా పాలన అంతా అరాచకంగా మారిందని, రాష్ట్రం అథోగతి పాలైందని బిజెపి జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి విమర్శించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టు నత్తనడక నడుస్తోందని, అయినా పాలకులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వైకాపా పాలనలో ఇసుక, మట్టి, కొండలు వంటి ప్రకృతి వనరులన్నీ దోపిడీకి గురవుతున్నాయని, ఏ ఒక్క వనరును వారు వదిలిపెట్టడం లేదని, ప్రభుత్వ వ్యవస్థలు వైకాపా రంగు వేసుకుని పనిచేయాల్సిన స్థితి ఏర్పడిందని, ఆలయాలపై దాడులు జరుగుతున్నా పట్టించుకునే దిక్కు లేదని, ఇదెక్కడి ఘోరమని ప్రశ్నించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, ప్రజలకు జగన్ ఎన్నో హామీలిచ్చారని, ఆ హామీలు ఎప్పటికి అమలవుతాయో? తెలియదని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజలను మభ్యపెడుతున్నారే తప్ప, తాను ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయాన్ని ఏ మాత్రం ఖాతరు చేయడం లేదని విమర్శించారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com